బుధవారం
WEDNESDAY
27.11.2024
సంచిక: 99
సంపుటి: 16
వెల రూ.6.00
పేజీలు: 8
PAGES: 8
హైదరాబాద్
HYDERABAD

సమగ్ర కథనాలు, ఈ పేపర్ కోసం స్కాన్ చేయండి

ఋషి

ధర్మం కోసం అక్షర తపస్సు తెలుగు దినపత్రిక

శ్రీకృష్ణుడి మాట

ఈ సృష్టిని
సృష్టించింది నేనే.
మధ్యలో ఉన్నది నేనే.
ముగించేది కూడా
నేనే

ముహూర్తం

27 నవంబర్ 2024 - బుధవారం శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం - శరత్ ఋతువు కార్తీక మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:31 సూర్యాస్తమయం - సా. 5:35 తిథిజి ద్వాదశి ఉ. 6:23o వరకు సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం చిత్తా ఉ. 7:29o వరకు యోగం ఆయుష్మాన్ మ. 3:10 వరకు కరణం కౌలవ సా. 5:06 వరకు తైతుల ఉ. 6:23o వరకు వర్జ్యం మ. 1:35 నుండి మ. 3:23 వరకు దుర్ముహూర్తం ఉ. 11:41 నుండి మ. 12:25 వరకు రాహుకాలం మ. 12:03 నుండి మ. 1:26 వరకు యమగండం ఉ. 7:54 నుండి ఉ. 9:17 వరకు గుళికాకాలం ఉ. 10:40 నుండి మ. 12:03 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:55 నుండి తె. 5:43 వరకు అమృత ఘడియలు రా. 12:23 నుండి రా. 2:11 వరకు అభిజిత్ ముహూర్తం లేదు

Published From HYDERABAD || www.rhushinews.com facebook: rhushinews twitter: rhushinews instagram: rhushinews



బంగ్లాదేశ్‌లో హిందూ నేత అరెస్టు

2

బెయిల్ నిరాకరణ

ఖండించిన భారత్

మైనార్టీలకు భద్రత కల్పించాలన్న భారత విదేశాంగ శాఖ

"బంగ్లాదేశ్ సమ్మిలిత్ సనాతన్ జాగ్రన్ జోటే ప్రతినిధి, హిందూ నాయకుడు చిన్మోయ్ కృష్ణదాస్‌ను అరెస్టు చేయడం, బెయిల్ నిరాకరించడం పట్ల తీవ్ర ఆందోళనతో ఉన్నాం. బంగ్లాదేశ్‌లో మైనార్టీల ఇళ్లు, వ్యాపార సంస్థలపై దాడులు జరిగాయి. అలాగే చోరీలు, దేవతా విగ్రహాలు, దేవాలయాలు ధ్వంసం జరిగాయి. వాటికి సంబంధించి అనేక కేసులు నమోదయ్యాయి. అలాంటి సంఘటనలకు పాల్పడినవారు పరారీలో ఉన్నారు. శాంతియుతంగా న్యాయబద్ధమైన డిమాండ్లను కోరే హిందూ నాయకుడిపై ఆరోపణలు చేయడం దురదృష్టకరం"

-భారత విదేశాంగ శాఖ

5 లక్షల ఉద్యోగాలు

గత పదేళ్లలో భారీగా ఉద్యోగాల భర్తీ

రాబోయే కాలంలో మరిన్ని ఉద్యోగాల కల్పన

రైల్వే చరిత్రలో తొలిసారి రిక్రూట్‌మెంట్ క్యాలెండర్

కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్

న్యూఢిల్లీ, నవంబర్ 26 (ఋషి ప్రతినిధి): పదేళ్లలో రైల్వే శాఖ 5లక్షల ఉద్యోగులను రిక్రూట్ చేసుకుందని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు.. గత దశాబ్ద కాలం (2014 -2024) లో రైల్వే శాఖ ఐదు లక్షల మంది ఉద్యోగులను రిక్రూట్ చేసిందని, ఇది అంతకుముందు దశాబ్దం (20042014) కంటే ఎక్కువగానే ఉందని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ సోమవారం తెలిపారు. నాగ్‌పూర్‌లోని అజనీ రైల్వే గ్రౌండ్‌లో జరిగిన ఆల్ ఇండియా -తరువాయి 2 వ పేజీలో...

ఎన్నికలొస్తే.. బీఆర్ఎస్‌దే విజయం

ఏం జరుగుతుందో.. నాలుగేండ్లు ఆగాల్సిందే

మీటింగుల్లో కేసీఆర్‌ను తిట్టటమే రేవంత్ పని.. దేవుళ్ల మీద ఒట్లు.. హామీలకు తూట్లు

ప్రజల దగ్గరకు పోతే సీఎంను ఛీకొట్టే పరిస్థితి.. కొడంగల్‌లో రైతులకు దగ్గరకు వెళ్లలేని దుస్థితి

కేసీఆర్ మాత్రమే తెలంగాణ మనిషి.. సిరిసిల్ల దీక్షాదివస్ సన్నాహకంలో కేటీఆర్

రేవంత్ పదవి తుమ్మితే ఊడిపోయే ముక్కు లెక్క

ఢిల్లీ వాళ్లకు కోపం వస్తే పదవి ఊడుతది

సిరిసిల్ల, నవంబర్ 26(ఋషి ప్రతినిధి): ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సరే బీఆర్ఎస్ భారీ విజయం సాధించడం ఖాయమని కేటీఆర్ అన్నారు. సిరిసిల్లలో దీక్షాదివస్ సన్నాహక కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రేవంత్ రెడ్డి సీఎం పదవి తుమ్మితే ఊడిపోయే ముక్కు లాంటి దేననని.. ఢిల్లీవాళ్లకు కోపం వస్తే ఆయన పదవి ఊడుతదన్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేమని.. కానీ తరువాయి 2 వ పేజీలో...

జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు..

కాంగ్రెస్, బిఆర్ఎస్‌దే

పాపం

కేంద్రమంత్రి బండి సంజయ్

హైదరాబాద్,నవంబర్26 (ఋషి ప్రతినిధి): జేఎన్‌జే జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీకి కేటాయించిన ఇండ్ల స్థలాలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పును వెలువరించడం అత్యంత బాధాకరమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఈ విషయంపై మంగళవారం హైదరాబాద్‌లో బండి సంజయ్ ఓ ప్రకటన విడుదల చేశారు. అత్యున్నత న్యాయ స్థానం వెలువరించిన తీర్పును గౌరవించాల్సిందేనని స్పష్టం చేశారు. అయితే జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు దక్కక పోవడానికి పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ తరువాయి 2 వ పేజీలో...

ఇచ్చిన మాట ప్రకారం కులగణన

కులగణనతోనే ఆర్థిక, సామాజిక న్యాయం

రాహుల్ మాట మేరకు తెలంగాణలో విజయవంతం

ఎఐసిసి సంవిధాన్ రక్షణ అభియాన్‌లో సిఎం రేవంత్

న్యూఢిల్లీ,నవంబర్26 (ఋషి ప్రతినిధి): తెలంగాణలో ఇచ్చిన మాట ప్రకారం కుల గణన చేపడుతున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సంవిధాన్ రక్షణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు, దళితులకు, ఆదివాసులకు భూ చట్టాలు తీసుకొచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. భారత్ జోడో యాత్ర పేరిట రాహుల్ గాంధీ అన్ని వర్గాల ప్రజలను కలుస్తూ వారి ఇబ్బందులు తెలుసుకున్నారని అన్నారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణలో రిజర్వేషన్లు అమలు చేసేందుకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కూడా కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని కాపాడేందుకు గాంధీ పరివార్ ఉందని.. రాహుల్ గాంధీకి అండగా తాము ఉన్నామని వ్యాఖ్యానించారు. రైతుల తరపున నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రాహుల్ గాంధీ అందోళన చేశారని.. అందుకే కేంద్రం నల్ల చట్టాలను వెనక్కి తీసుకుందని వివరించారు. తెలంగాణ సర్కార్ ప్రతిష్ఠాత్మకంగా కులగణన చేపట్టింది. కొన్ని చోట్ల ఇప్పటికే ప్రజల నుండి వివరాలు నమోదు చేసుకుంది. మంత్రులు, ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు క్షేత్రస్థాయిలో సర్వేను పర్యవేక్షిస్తూ సర్వే సిబ్బందికి మార్గనిర్దేశం చేస్తున్నారు. సర్వేలో మొత్తం 85 వేల మంది ఎన్యుమరేటర్లు, 8,500 మంది సూపర్‌వైజర్లు పాల్గొంటున్నారు. ఇంటి నంబరు, యజమాని పేరు నమోదు చేసే కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ -తరువాయి 2 వ పేజీలో...

గెలిస్తే సరేసరి..

లేకుంటే ట్యాంపరింగా?

కెఏ పాల్ పిటిషన్‌పై సుప్రీం ఆగ్రహం

3

బ్యాలెట్ పేపరే కావాలి

ఈవీఎంలతో ఓటింగ్‌లో అవకతవకలు

బ్యాలెట్ పేపర్‌పై ప్రజల్లో అవగాహన కల్పిస్తాం

కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే

న్యూఢిల్లీ, నవంబర్ 26 (ఋషి ప్రతినిధి): ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌లతో ఓటింగ్‌లో అవకతవకలు జరుగుతున్నాయని, వాటికి బదులుగా ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్స్‌నే వినియోగించాలని కాంగ్రెస్ పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన అభిప్రాయాన్ని వెల్లడించారు. ఈవీఎంలలో ఎలాంటి లోపాలు లేవని, ఈవీఎంలకు వ్యతిరేకంగా వచ్చే ఫిర్యాదులను తాము ఎంటర్‌టైన్ చేయదల్చుకోలేదని కేఏ పాల్ పిటిషన్‌ను కొట్టివేస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన రోజే ఖర్గే ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.'ఈవీఎంలను పక్కన పెట్టాలంటే మనం అందరం ఒక్కతాటిపైకి రావాల్సిన అవసరం ఉంది. నేను ఎన్నికల గురించి మాట్లాడాలనుకోవడం లేదు. అయితే ఈవీఎంల కారణంగా పేద, బడుగు బలహీన వర్గాల ఓట్లు వృథా అవుతున్నాయి. వాళ్లంతా బ్యాలెట్ పేపర్ ఓటింగ్‌నే కోరుకుంటున్నారు' అని ఖర్గే చెప్పారు. ఢిల్లీలోని తల్కతోరా -తరువాయి 2 వ పేజీలో...

మెట్రోకు 116.4 కి.మీ ప్లాన్

రెండో దశలో 6 కారిడార్లు.. సిఎంతో చర్చించామన్న ఎన్‌విఎస్‌రెడ్డి

3

గజగజ.. 9.3 డిగ్రీలు

సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో అత్యల్పం

రోజురోజుకూ పెరుగుతున్న చలి తీవ్రత

3

మహారాష్ట్ర కొత్త సీఎంపై

సస్పెన్స్ కంటిన్యూ

కొత్త సీఎంపై వీడని సందిగ్ధత!!

గవర్నర్‌కు షిండే రాజీనామా సమర్పణ

2

ఋషి దినపత్రిక కోసం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా పనిచేయుటకు మండలాల వారీగా విలేకరులు కావలెను.

ఆసక్తి ఉన్న యువకులు 9666711515 నంబర్‌కు వాట్సాప్ ద్వారా,
rhushinews@gmail.com
మెయిల్‌కు బయో డేటా పంపగలరు.

ఎన్నికలొస్తే బీఆర్ఎస్‌దే విజయం

తరువాయి 2 వ పేజీలో...

నాలుగేళ్లు వేచి చూడాల్సిందేనన్నారు. సిరిసిల్లలో ప్రజలు ఛీ కొట్టిన సరే అధికారులను అడ్డం పెట్టుకొని ఎగురుతున్న కాంగ్రెస్ సన్నాసులను గుర్తుపెట్టుకుంటామన్నారు. మొన్న సీఎం వేములవాడకు వచ్చాడని.. నాలుగు మంచి మాటలు చెబుతాడనుకున్నానన్నారు. బాలల దినోత్సవమైనా, రాజీవ్ సద్భావన యాత్ర అయినా, ఆయన పుట్టిన రోజు అయినా.. వేములవాడలో మీటింగ్ అయినా సరే కేసీఆర్‌ను తిట్టటమే పని అని.. దేవుళ్ల మీద ఒట్లు, హామీలకు తూట్లు, కేసీఆర్‌పై తిట్లు ఇవి తప్ప నువ్వేం పీకినవ్ అంటూ మండిపడ్డారు. ప్రజల దగ్గరకు పోతే జనాలను సీఎంను ఛీ కొట్టే పరిస్థితి ఉందన్నారు. కొడంగల్‌లో రైతులకు దగ్గరకు వెళ్లలేని పరిస్థితి రేవంత్‌ది అంటూ విమర్శించారు.నేరెళ్లలో ఒక సంఘటన జరిగిందని.. బాధితులకు న్యాయం చేసేందుకు తాను ప్రయత్నం చేశానన్నారు. వాళ్లను కలిశానని.. వీలైనంత వరకు సాయం చేశానన్నారు. మీరు రాజకీయం చేసే ప్రయత్నం చేశారని.. నెరేళ్ల ప్రజలంతా మొన్నటి ఎన్నికల్లో మాకే అత్యధిక ఓట్లు వేశారన్నారు. ప్రజాస్వామ్యంలో పాలకులు అంటే ప్రజలతో తిట్లు తిన్నా సరే వారి మనసు గెలుచుకునే ప్రయత్నం చేయాలంటూ చురకలంటించారు. కొడంగల్‌లో రైతులు ఏం అడిగారు.. తమ భూములకు ఎక్కువ డబ్బులు ఇవ్వాలని కోరారన్నారు. తొమ్మిది నెలలుగా నిరసన చేస్తున్నారని.. ధర్నాలు చేస్తున్నారన్నారు. అయినా వాళ్లకు సీఎం సమయం ఇవ్వలేదన్నారు. సీఎం తమ్ముడు, మంత్రులు ఎవ్వరూ వాళ్లు బతిమాలినా పట్టించుకోలేదన్నారు. ఆఖరికి కలెక్టర్ ప్రజాభిప్రాయ సేకరణకు వెళితే నిరసన తెలిపారని.. అదే రేవంత్ రెడ్డి పోయి ఉంటే ఉరికించి.. ఉరికించి కొట్టేవారన్నారు. సీఎం కేవలం అదానీ, తన అన్న, అల్లుడు, బావమరిదికి అమృతం పంచేందుకు మాత్రమే పని చేస్తున్నాడని.. ప్రజల కోసం ఏమీ చేయలేదంటూ మండిపడ్డారు. 28 సార్లు ఢిల్లీకి పోయిండని.. ఫ్లైట్ ఛార్జీలు వృథా తప్ప 28 రూపాయలు కూడా తీసుకురాలేదనన్నారు. ఎనిమిది 8 మంది బీజేపీ ఎంపీలు గెలిచారని.. వారంతా 8 రూపాయల నిధులు లేదన్నారు. ప్రజలందరూ కాంగ్రెస్, బీజేపీ చేస్తున్న పనులను గమనిస్తున్నారన్నారు.హైదరాబాద్‌లో ఓ ఆటో డ్రైవర్‌తో మాట్లాడితే ఈ ప్రభుత్వం పోయేందుకు ఏదైనా ఉపాయం లేదా అడుగుతున్నాడన్నారు. ఒకసారి ఓటు వేస్తే ఐదేళ్లు శిక్ష పడాల్నా అంటున్నాడని.. తప్పదు మరో నాలుగేళ్లు వీళ్లు పీక్క తింటూనే ఉంటారన్నారు. ఈ ముఖ్యమంత్రికి కనీస అవగాహన, పరిజ్ఞానం కూడా లేదన్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా సిరిసిల్లలో నేతన్నలు ఉన్నారని.. మరి ఇక్కడ పెట్టాల్సిన నూలు డిపోను తీసుకొని పోయి వేములవాడలో పెట్టిండంటూ ప్రశ్నించారు.

గుండుకు దెబ్బ తాకితే మోకాలి మందు పెట్టినట్లుగా ఉందన్నారు. ఇంతా తెలివైన వాళ్లు ఉండటం మన అదృష్టమన్నారు. ఏడాది పాలనలో ముఖ్యమంత్రిని ప్రజలు ఇన్ని తిట్లు తిట్టటం నేను ఎప్పుడు చూడలేదన్నారు. మీడియా, యూట్యూబ్ వాళ్లు మైక్ పెడితే చాలు ఏమాత్రం సంకోచించకుండా రేవంత్ రెడ్డిని పొట్టు పొట్టు తిడుతున్నారన్నారు. ఆ తిట్లు విన్నాక రేషం ఉన్నోడైతే బిల్డింగ్ మీది నుంచి దూకి చస్తాడన్నారు. కానీ, రేవంత్ రెడ్డి కాబట్టి నడిచిపోతోందన్నారు. ఏడాదిలోపే ప్రభుత్వంపై ఇంత వ్యతిరేకత ఊహించలేదన్నారు. మనం పిలుపునిస్తే ఈ ప్రభుత్వానికి ప్రజలే సంవత్సరీకం పెట్టే పరిస్థితి ఉందన్నారు. అమ్మ విలువ, అన్నం విలువ లేనప్పుడే మనకు తెలుస్తుందన్నారు. అదే విధంగా ఇప్పుడు గ్రామ గ్రామాన కేసీఆర్ గురించే మాట్లాడుతున్నారు. హైదరాబాద్‌లో నాచారంలోని చెప్పుల దుకాణం, హుజూర్‌నగర్‌లో నాయీ బ్రాహ్మణుడి షాప్‌ను రేవంత్ రెడ్డి ప్రభుత్వం తొలగిస్తుంటే వాళ్లు కేసీఆర్ ఎక్కడ ఉన్నావంటూ గుర్తు చేసుకుంటున్నారన్నారు. ఎప్పుడు ఎలక్షన్ వస్తుందా? కాంగ్రెస్ ను ఎప్పుడు పాతర పెడదామా? అని ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. 2001 నుంచి ఇక్కడ జిల్లా పరిషత్ ఎన్నికల్లో

బీఆర్ఎస్ జెండానే ఎగిరిందని.. మళ్లీ బీఆర్ఎస్ గెలుపు ఖాయమన్నారు. ప్రజల్లో కేసీఆర్ పట్ల ఎనలేని వాత్సల్యం, ప్రేమ ఉందన్నారు. దాన్ని ఎలా అనుకూలంగా మలుచుకోవాలన్నదే మనం చేయాల్సిన పనన్నారు. మనుషులుగా మనం కూడా తప్పులు, పొరపాట్లు చేసి ఉండవచ్చని.. వాటి నుంచి ఏం నేర్చుకున్నామన్నదే ముఖ్యన్నారు. ఆనాడు 'కేసీఆర్ సచ్చుడో%%తెలంగాణ తెచ్చుడో' అని కేసీఆర్ ఏ విధంగా తెలంగాణ తెచ్చారో గుర్తు చేసుకోవాలని సూచించారు. కేసీఆర్ స్ఫూర్తితో కాంగ్రెస్, బీజేపీకి వ్యతిరేకంగా మహా సంకల్ప దీక్ష చేయాల్సి ఉందన్నారు. తెలంగాణ తెచ్చిన దానికన్నా కేసీఆర్‌కు వచ్చే పెద్ద పేరు ఇంకేమీ లేదన్నారు. తెలంగాణ ఆడబిడ్డలు, తెలంగాణ రైతులు, నేతన్నలు, వృద్ధులు, తెలంగాణ ప్రజానీకానికి మేలు జరగాలంటే కేసీఆర్ కావాలన్నారు. విడిపోతే.. చెడిపోతాం అంటూ మొన్న మహారాష్ట్ర ఎన్నికల్లో ఒక నినాదం బాగా పాపులర్ అయ్యిందని.. మనం కూడా ఎన్నికలు వస్తే విడిపోకుండా జాగ్రత్త పడాలని.. లేకపోతే అన్యాయం జరుగుతుందన్నారు. తెలంగాణ మీద గులాబీ జెండాకు ఉన్న ప్రేమ ఢిల్లీ పార్టీలకు ఉండదని.. కేసీఆర్ మాత్రమే తెలంగాణ మట్టి మనిషి అవుతాడని.. కాంగ్రెస్, బీజేపీ నేతలు ఢిల్లీ మనుషులేనన్నారు. మన నాయకుడి పోరాటం, తెలంగాణ విద్యార్థుల బలిదానాన్ని దీక్షా దివస్ సందర్భంగా మరోసారి గుర్తు చేసుకోవాల్సి ఉందన్నారు. ఆనాడు తెలంగాణ ఇయ్యాక తప్పని పరిస్థితిని తీసుకొచ్చింది కేసీఆర్ అని.. నవంబర్ 29, 2009 నాడు కేసీఆర్ అనే బక్క మనిషి, ఉక్కు సంకల్పంతో చేపట్టిన దీక్ష కారణంగానే తెలంగాణ సాధ్యమైందని స్పష్టం చేశారు.

తెలంగాణ ఏర్పాటైన జూన్ 2వ తేదీ ఎంత ముఖ్యమో.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కీలక మలుపు అయిన దీక్షా దివస్ నవంబర్ 29 అంతే ముఖ్యమన్నారు. నవంబర్ 29 నుంచి డిసెంబర్ 9 వ తేదీ వరకు పదకొండు రోజులు జరిగిన దీక్ష కారణంగా అనివార్యంగా తెలంగాణ ఇవ్వాల్సి వచ్చిందన్నారు. ఏ రోజైతే తెలంగాణ ప్రకటన వచ్చిందో అదే డిసెంబర్ 9వ తేదీని విజయ దివస్‌గా జరుపుకుందామన్నారు. కాగా రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు హెచ్చరికలు జారీ చేశారు. బీఆర్ఎస్ నాయకులను పార్టీ మారాలని చెబుతున్నారట అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నేడు రాజ్యాంగ దినోత్సవమని.. బాబా సాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలో ఆర్టికల్-3 ద్వారానే తెలంగాణ సాధ్యమైందన్నారు. అందుకే తెలంగాణ ప్రజలంతా ఆయనకు రుణపడి ఉంటారన్నారు. ఆయన చూపిన బాటలోనే బోధించు, పోరాడు, సమీకరించు అన్న విధానంలోనే కేసీఆర్ పోరాటం చేసి తెలంగాణ సాధించారని గుర్తు చేశారు.

బ్యాలెట్ పేపరే కావాలి

మొదటి పేజీ తరువాయి

ట్టేడియంలో జరిగిన సంవిధాన్ రక్షక్ అభియాన్ కార్యక్రమంలో ఖర్గే మాట్లాడారు. 'ఈవీఎంలు వాళ్ల దగ్గరే పెట్టుకోనివ్వండి. మాకు ఈవీఎంలు వద్దు. మేం బ్యాలెట్ పేపర్‌తో జరిగే ఓటింగ్‌ను కోరుకుంటున్నాం.' అని ఖర్గే అన్నారు. బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ కోసం రాహుల్‌గాంధీ మరోసారి భారత్ జోడో యాత్ర చేయాలని ఖర్గే కోరారు. బ్యాలెట్ పేపర్ ఓటింగ్ అవసరంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తామని అన్నారు. అందుకోసం ఇతర రాజకీయ పార్టీలతో కూడా మాట్లాడుతామని చెప్పారు.

ఇచ్చిన మాట ప్రకారం కులగణన

మొదటి పేజీ తరువాయి

నేతలు పాల్గొంటున్నారు. ప్రతి కుటుంబంలో సభ్యులందరి ఫోన్, ఆధార్ నంబర్లు సహా సమస్త వివరాలతో కూడిన 75 ప్రశ్నలను అడిగి నమోదు చేసుకుంటున్నారు. రాష్ట్రంలో మొత్తం 1,17,44,954 కుటుంబాలున్నాయని.. ఇళ్లను 87,092 ఎన్యూమరేషన్ బ్లాక్‌లుగా విభజించి కులగణన చేపట్టినట్లు రాష్ట్ర ప్రణాళిక శాఖ తెలిపారు. అన్ని వర్గాలకు సామాజిక న్యాయం కాంగ్రెస్?తోనే సాధ్యమని, రాహుల్ గాంధీ నాయకత్వంలో అందరికి సామాజిక న్యాయం జరుగుతోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, లోక్ సభ పక్ష నేత రాహుల్ గాంధీ, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తదితర కీలక నేతలు హాజరయ్యారు. దేశంలో రాజ్యాంగ పవిత్రతను కాపాడింది కాంగ్రెస్ పార్టీనేనని అన్నారు. గాంధీ పరివార్ రాజ్యాంగాన్ని కాపాడే ప్రయత్నం చేస్తుంటే.. మోడీ పరివార్ రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేస్తోందన్నా ÷ర్ అయ్యారు. రాజ్యాంగ పరిరక్షణలో రాహుల్ గాంధీ వెంట దేశ ప్రజలంతా ఉన్నారన్నారు. ప్రతి ఒక్క వర్గానికి కాంగ్రెస్ పార్టీ న్యాయం చేసిందని.. ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు కాపాడింది కాంగ్రెస్సేనని వ్యాఖ్యానించారు. కుల గణనతోనే ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులు తెలుస్తాయని.. ఇందుకోసమే దేశవ్యాప్తంగా కుల గుణన కోసం కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని తెలిపారు. దేశంలో సామాజిక న్యాయాన్ని అందించింది ఒక్క కాంగ్రెస్ పార్టీనేనని అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మాట ప్రకారమే తెలంగాణలో కుల గణన చేపట్టామని.. కుల గణన సర్వే ఇప్పటి వరకు 92 శాతం పూర్తి అయ్యిందని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టబోయే జన గణన సర్వేలోనూ కులాల లెక్కలు తీయాలని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు.

5 లక్షల ఉద్యోగాలు

మొదటి పేజీ తరువాయి

ఎస్సీ/ఎస్టీ రైల్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ జాతీయ సదస్సులో కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ ఈ ప్రకటన చేశారు. ప్రస్తుతం 12,000 జనరల్ కోచ్‌లు ఉత్పత్తిలో ఉన్నాయని, రానున్న కాలంలో మరిన్ని ఉద్యోగాలు ఇస్తామని కేంద్ర మంత్రి తెలిపారు. 2004 - 2014 మధ్య రైల్వే రిక్రూట్‌మెంట్ సంఖ్య 4.4 లక్షలు అని మంత్రి అశ్విని వైష్ణవ్ చెప్పారు. భారతీయ రైల్వే చరిత్రలో తొలిసారిగా వార్షిక రిక్రూట్‌మెంట్ క్యాలెండర్‌ను ప్రవేశపెట్టడాన్ని కూడా ఆయన హైలైట్ చేశారు. ఇది అంతకుముందెన్నడూ జరగలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బిఎల్ భైరవ, సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ ధరమ్‌వీర్ మీనా, సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ నీను తదితరులు పాల్గొన్నారు. పార్లమెంటులో అడుగుపెట్టే ముందు రాజ్యాంగానికి తలవంచాలన్న ప్రధాని నరేంద్ర మోదీ సంజ్ఞను కూడా వైష్ణవ్ అభినందించారు. రాజ్యాంగం పట్ల గౌరవం ప్రతీకాత్మకతకు మించినది.. అది ఆయన చర్యలో ప్రతిబింభిస్తుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కృషిని స్మరించుకునే సావనీర్‌ను వైష్ణవ్ ఆవిష్కరించారు. ముందుగా దీక్షాభూమిలోని సెంట్రల్ మెమోరియల్ వద్ద డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు నివాళులర్పించారు.

గెలిస్తే సరేసరి.. లేకుంటే ట్యాంపరింగా?

కెఎ పాల్ పిటిషన్‌పై సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ,నవంబర్26 (ఋషి ప్రతినిధి): గెలిస్తే ఇవిఎంలు మంచివి..లేకుంటే చెడ్డవా అంటూ సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈవీఎంలను రద్దుచేసి దేశవ్యాప్తంగా ఎన్నికల్లో మళ్లీ బ్యాలెట్ విధానాన్ని తీసుకుని రావాలంటూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈవీఎం విధానాన్ని రద్దు చేసి తిరిగి పేపర్ బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికల నిర్వహించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ కేఏ పాల్ పిటిషన్ దాఖలు చేశారు. విదేశాల్లో ఇప్పటికీ బ్యాలెట్ విధానాన్నే అనుసరిస్తున్నారని, భారత్ కూడా దాన్నే కొనసాగిస్తే బాగుంటుందని అన్నారు. అంతేకాకుండా.. ఎన్నికల సందర్భంగా దేశంలో రూ.వేల కోట్లలో అవినీతి జరుగుతోందని ఆరోపించారు. ఈ పిటిషన్‌పై సుప్రీం ధర్మాసనం ఒకింత అసహనం వ్యక్తం చేసింది. 'ఇక్కడ ఏం జరుగుతోంది. మీరు గెలిస్తే ఈవీఎంలను ట్యాంపరింగ్ చేయలేదు అంటారు. ఓడిపోతే మాత్రం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ట్యాంపరింగ్ జరిగిందంటారు.

బంగ్లాదేశ్‌లో హిందూ నేత అరెస్టు

న్యూఢిల్లీ, నవంబర్ 26 (ఋషి ప్రతినిధి): బంగ్లాదేశ్‌లోని హిందూ నాయకుడు చిన్మోయ్ కృష్ణదాస్‌ను అరెస్ట్ చేయడం, ఆయనకు బెయిల్ నిరాకరించడంపై భారత విదేశాంగ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. బంగ్లాదేశ్‌లోని హిందువులు, మైనార్టీలకు భద్రత కల్పించాలని అధికారులను కోరింది. చిన్మోయ్ కృష్ణదాస్ అరెస్టుకు వ్యతిరేకంగా బంగ్లాదేశ్‌లో శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్న మైనార్టీలపై దాడులు ఆందోళనకరమని వ్యాఖ్యానించింది. "బంగ్లాదేశ్ సమ్మిలిత్ సనాతన్ జాగ్రన్ జోటే ప్రతినిధి, హిందూ నాయకుడు చిన్మోయ్ కృష్ణదాస్‌ను అరెస్టు చేయడం, బెయిల్ నిరాకరించడం పట్ల తీవ్ర ఆందోళనతో ఉన్నాం. బంగ్లాదేశ్‌లో మైనార్టీల ఇళ్లు, వ్యాపార సంస్థలపై దాడులు జరిగాయి. అలాగే చోరీలు, దేవతా విగ్రహాలు, దేవాలయాలు ధ్వంసం జరిగాయి. వాటికి సంబంధించి అనేక కేసులు నమోదయ్యాయి. అలాంటి సంఘటనలకు పాల్పడినవారు పరారీలో ఉన్నారు. శాంతియుతంగా న్యాయబద్ధమైన డిమాండ్లను కోరే హిందూ నాయకుడిపై ఆరోపణలు చేయడం దురదృష్టకరం" అని భారత విదేశాంగ శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. బంగ్లాదేశ్‌లో చిన్మోయ్ కృష్ణదాస్‌ను అరెస్ట్ చేయడంపై ఇశా ఫౌండేషన్ అధినేత జగ్గీ వాసుదేవ్ స్పందించారు. "ప్రజాస్వామ్యయుత దేశం మతతత్వ, నిరంకుశ దేశంగా మారడం వల్ల ఎలా విచ్ఛిన్నమవుతుందో చూస్తున్నాం. ప్రజాస్వామ్యం విలువలను అర్థం చేసుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత. మతం, జనాభా ఆధారంగా హింసించడం ప్రజాస్వామ్య దేశాల మార్గం కాదు. దురదృష్టవశాత్తు మన పొరుగు దేశం ప్రజాస్వామ్య సూత్రాలను వదిలేసింది. పౌరులందరికీ వారి అవసరాలు, నమ్మకాల ప్రకారం జీవించే హక్కు ఉంది. అలాంటి ప్రజాస్వామ్య దేశాన్ని తిరిగి నిర్మించడం బంగ్లాదేశ్‌లోని ప్రతి పౌరుడి బాధ్యత" అని జగ్గీ వాసుదేవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూ నాయకుడు చిన్మయ్ కృష్ణదాస్ అక్టోబరు 30న బంగ్లాదేశ్‌లోని ఢాకాలో జరిగిన ఓ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ క్రమంలో బంగ్లాదేశ్ జెండాను అగౌరవపరచారని ఆరోపణలు ఉన్నాయి. దీంతో చిన్మయ్ కృష్ణదాస్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు, ఢాకాలోని హజ్రత్ షాజలాల్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్‌లో సోమవారం అరెస్టు చేశారు. దాస్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసు డిటెక్టివ్ బ్రాంచ్ ప్రతినిధి రెజాల్ కరీం తెలిపారు. ఛటోగ్రామ్ పోలీస్ స్టేషన్‌కు చిన్మయ్ కృష్ణదాస్‌ను అప్పగించనున్నట్లు వెల్లడించారు. మరోవైపు, హిందూ నాయకుడు చిన్మయ్ కృష్ణదాస్ అరెస్టును పలు హిందూ సంఘాలు ఖండించాయి. ఆయనను విడుదల చేయాలని డిమాండ్ చేశాయి.

కొత్త సీఎంపై సస్పెన్స్ కంటిన్యూ

మహారాష్ట్ర కొత్త ముఖ్యమంత్రిపై వీడని సందిగ్ధత!!

గవర్నర్‌కు షిండే రాజీనామా సమర్పణ

ముంబై, నవంబర్ 26 (ఋషి ప్రతినిధి): మహారాష్ట్ర కొత్త సీఎంపై సస్పెన్స్ కంటిన్యూ అవుతోంది. ఫడ్నవిస్, షిండే మధ్య కుర్చీ నీదానీదా అన్నట్లుగా రాజకీయం సాగుతోంది. అయితే, ఫడ్నవీస్, అజిత్ పవార్‌తో కలిసి రాజ్‌భవన్‌కు వెళ్లారు షిండే. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ముంబైలోని రాజ్‌భవన్‌లో గవర్నర్ సి.పి.రాధాకృష్ణన్‌కు రాజీనామా లేఖ సమర్పించారు. డిప్యూటీ సీఎంలు దేవేంద్ర ఫడ్నవీస్, అజిత్ పవార్‌తో కలిసి రాజ్‌భవన్‌కు వచ్చిన సీఎం షిండే తన రాజీనామాను అందజేశారు.మహారాష్ట్ర శాసనసభ పదవీకాలం నేటితో ముగియనున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి పదవికి ఏక్‌నాథ్ షిండే రాజీనామా చేశారు. గవర్నర్ రాజీనామాను ఆమోదించి, కొత్త ముఖ్యమంత్రిని నియమించే వరకు తాత్కాలిక ముఖ్యమంత్రిగా ఏకనాథ్ షిండేను నియమిస్తూ లేఖను అందజేశారు. ప్రమాణస్వీకార కార్యక్రమం వరకు ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా వ్యవహరించాలని గవర్నర్ ఏక్నాథ్ షిండేను ఆదేశించారు.మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, శివసేన, ఎన్సీపీల మహాకూటమి విజయం సాధించింది. నవంబర్ 23 న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 'మహాయుతి' కూటమి భారీ మెజారిటీ సాధించింది. మహాకూటమిలో భాగమైన బీజేపీ 132 సీట్లు, ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన 57 సీట్లు, అజిత్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) 41 సీట్లు గెలుచుకున్నాయి. అదే సమయంలో, మహా వికాస్ అఘాడిలో చేరిన శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాకరే) గరిష్టంగా 20 సీట్లు గెలుచుకుంది. కాంగ్రెస్ 16 స్థానాలు, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (శరద్‌చంద్ర పవార్) 10 స్థానాల్లో గెలుపొందాయి. సమాజ్‌వాదీ పార్టీ రెండు స్థానాల్లో గెలుపొందగా, ఇతరులు 10 స్థానాల్లో విజయం సాధించారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఎవరన్నదానిపై ఇంకా ఉత్కంఠ కొనసాగుతోంది. సీఎం పదవికి సంబంధించి ముంబైలో పలు దఫాలుగా సమావేశాలు జరిగినా ఢిల్లీలో ఖరారు కావాల్సి ఉంది. బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవీస్ ఒక ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనడానికి ఢిల్లీకి వచ్చారు. అయితే భారతీయ జనతా పార్టీ పెద్దలు ఎవరినీ కలవకుండా ముంబైకి తిరిగి వచ్చారు. బీజేపీ అగ్రనేతలెవరినీ ఆయన కలవలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి.లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కుమార్తె వివాహ వేడుకకు హాజరైన తర్వాత ఫడ్నవీస్ తిరిగి విమానాశ్రయానికి వెళ్లినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. నిజానికి మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి ఘనవిజయం సాధించింది. గెలుపు తర్వాత సీఎం ఎవరన్న దానిపై మల్లగుల్లాలు పడుతోంది. మహారాష్ట్ర అసెంబ్లీ పదవీకాలం నేటితో ముగియనుంది. ఈరోజు సీఎం పదవికి ఏక్‌నాథ్ షిండే రాజీనామా సమర్పించనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. దీని తర్వాత మహారాష్ట్రలో ఎవరి హస్తం ఉంటుందన్న ఉత్కంఠ నెలకొంది. ఫడ్నవీస్ సీఎం అవుతారా లేక ఏక్‌నాథ్ షిండేకు కమాండ్ వస్తుందా.. లేక అధికారం వేరొకరికి దక్కుతుందా అనేది ఇప్పటికిప్పుడు నిర్ణయించలేదు. మహారాష్ట్ర కొత్త సీఎంపై సస్పెన్స్ కంటిన్యూ అవుతోంది. ఫడ్నవిస్, షిండే మధ్య కుర్చీ నీదానీదా అన్నట్లుగా రాజకీయం సాగుతోంది. కీలక సమయంలో సంచలన ట్వీట్ చేశారు ఏక్‌నాథ్ షిండ్. తనను కలవడానికి రావొద్దంటూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే. తన ఇంటి ముందు హడావిడి చేయొద్దంటూ నేతలకు సూచించారు. కొత్త సీఎంపై ఇంకా స్పష్టత రాకపోవడంతో షిండే కామెంట్స్ ఆసక్తికరంగా మారాయి. మహారాష్ట్ర ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ మరోసారి అతిపెద్ద పార్టీగా అవతరించింది. 149 స్థానాల్లో పోటీ చేసిన బీజేపీ 132 స్థానాల్లో విజయం సాధించింది. శివసేన 57 సీట్లు, ఎన్సీపీ 41 సీట్లు గెలుచుకున్నాయి. బీజేపీ అతిపెద్ద పార్టీ, అందుకే బీజేపీ ముఖ్యమంత్రి పీఠాన్ని ఆశిస్తోంది. అయితే ఇంకా ఎవరన్న దానికి సంబంధించి ఇంకా నిర్ణయం తీసుకోలేదు. అయితే, ఫడ్నవీస్ ముఖ్యమంత్రి పదవికి బలమైన నేతగా పరిగణిస్తున్నారు. మహాయుతి ఏకనాథ్ షిండే నాయకత్వంలో మహారాష్ట్రలో ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ, రాజకీయ సమీకరణాలను సెట్ చేయడం ఫడ్నవీస్‌గా కనిపించింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి, మహాయుతికి తన వ్యూహంతో రికార్డ్ బ్రేకింగ్ విజయాన్ని అందించారు ఫడ్నవీస్. 2019లో ఫడ్నవీస్ ముఖ్యమంత్రి కాలేకపోయారు. ఎందుకంటే ఉద్ధవ్ ఠాక్రే కూటమిని విచ్ఛిన్నం చేసి కాంగ్రెస్, ఎన్సిపితో కలిసి వెళ్లాలని నిర్ణయించుకున్నారు.అయితే, మీడియా కథనాల ప్రకారం, భారతీయ జనత పార్టీకి సీఎం పదవిని ఇవ్వాలని మహాకూటమిలో ఒప్పందం కుదిరినట్లు సమాచారం. దేవేంద్ర ఫడ్నవిస్ బీజేపీ నుండి ఈ బాధ్యతను పొందవచ్చని తెలుస్తోంది. శివసేన, ఎన్సీపీ వర్గాల నుంచి ఒక్కొక్కరు ఒక్కో డిప్యూటీ సీఎం ఉంటారు. అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజారిటీ సాధించిన నేపథ్యంలో సీఎం పదవి కోసం బీజేపీ, శివసేన మధ్య పోటీ నెలకొంది. నిజానికి ఏకనాథ్ షిండేను సీఎం చేయాలని శివసేన డిమాండ్ చేస్తోంది. బీజేపీ ఎక్కువ సీట్లు గెలుచుకున్నప్పటికీ బీహార్‌లో నితీష్ కుమార్‌ను సీఎం చేసిన బీహార్ ఫార్ములా మహారాష్ట్రలో అమలు చేయాలని శివసేన డిమాండ్ చేస్తోంది. ఏడుగురు శివసేన ఎంపీలు కూడా ప్రధానిని కలిసి ఒత్తిడి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

గజగజ.. 9.3 డిగ్రీలు

సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో అత్యల్పం

రోజురోజుకూ పెరుగుతున్న చలి తీవ్రత

హైదరాబాద్, నవంబర్ 26 (ఋషి ప్రతినిధి): తెలంగాణలో రోజు రోజుకు చలి తీవ్రత పెరుగుతున్నది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో 15 డిగ్రీలలోపు కనిష్ఠ రాత్రి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉత్తర, మధ్య తెలంగాణ జిల్లాల్లో చలి ఎకువగా ఉన్నదని వాతావరణ శాఖ తెలిపింది. ఇక ఉమ్మడి మెదక్ జిల్లాలోని పలుచోట్ల ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోయాయి. సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో 9.3 డిగ్రీలు నమోదయింది. అదేవిధంగా న్యాల్కల్‌లో 9.6 డిగ్రీలు, గుమ్మడిదలలో 10 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత రికార్డయింది. ఇక మెదక్ జిల్లా శివ్వంపేటలో 10 డిగ్రీలు, సిద్దిపేట జిల్లా పోతిరెడ్డిపేటలో 10.2 డిగ్రీలు నమోదయింది. సోమవారం రాష్ట్రంలోనే అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రతలు కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో రికార్డయిన విషయం తెలిసిందే. సిర్పూర్(యూ)లో రికార్డు స్థాయిలో 8.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో అత్యల్పంగా 8.8, ఆదిలాబాద్ జిల్లా బేలలో 9.9 డిగ్రీలు నమోదైంది. జోగులాంబ గద్వాలలో 15.1, సూర్యాపేటలో 15.6, వనపర్తిలో 15.9 డిగ్రీలుగా నమోదైంది. తూర్పు, ఈశాన్య ప్రాంతాల నుంచి రాష్ట్రం వైపు గాలులు వీస్తుండటమే చలి తీవ్రత పెరగటానికి కారణమని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా రానున్న మూడ్రోజులు చలి తీవ్రత మరింత అధికంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఆసిఫాబాద్, సంగారెడ్డి, ఆదిలాబాద్ జిల్లాల్లో 10 డిగ్రీలలోపు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మిగిలిన 27 జిల్లాల్లో 15 డిగ్రీల లోపు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. ప్రతి ఏడాది డిసెంబర్‌లో ఉష్ణోగ్రతలు తకువ స్థాయికి పడిపోతుంటాయి. ఈ ఏడాది కొన్ని జిల్లాల్లో నవంబర్‌ల

తెలంగాణలో విమానాశ్రయాల అభివృద్ధి

త్వరగా మూడింటి అభివృద్ధికి చర్యలు.. కేంద్రమంత్రి రామ్మోహన్‌తో సిఎం చర్చలు

త్వరగా పూర్తి చేస్తామని కేంద్ర మంత్రి హామీ

న్యూఢిల్లీ,నవంబర్26 (ఋషి ప్రతినిధి): రాష్ట్రంలో విమానాశ్రయాల ఏర్పాటుకు అనుకూలమైన ప్రాంతాల గురించి కేంద్రం దృష్టికి తీసుకెళ్లామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు.. ముఖ్యంగా వరంగల్ ఎయిర్ పోర్టు పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. భూ సేకరణ ఎంత తొందరగా పూర్తయితే.. అంత త్వరగా ఎయిర్ పోర్టు నిర్మాణ పనులు చేపడతామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం, పెద్దపల్లి, ఆదిలాబాద్ ప్రాంతాల్లో ఎయిర్ పోర్టు నిర్మాణాలు చేపట్టాలని సీఎం ప్రతిపాదించారు. దిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడితో సమావేశమయ్యారు. ఆయనతో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పార్లమెంట్ సభ్యులు ఉన్నారు. ఆయా ప్రాంతాల్లో ఎయిర్ పోర్టుల నిర్మాణాలకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వ హయాంలోనే వరంగల్ విమానాశ్రయాన్ని నూటికి నూరుపాళ్లు పూర్తి చేస్తామని కేంద్ర పౌర విమానాయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడితో

సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. అనంతరం కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. వరంగల్‌తోపాటు మరో మూడు.. పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్ విమానాశ్రయాలను అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి తమను కోరారన్నారు. అయితే పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం విషయంలో ఫీజిబిలిటీ స్టడీ చేయాల్సి ఉందన్నారు. అందుకు సంబంధించిన నివేదిక సానుకూలంగా వస్తే.. అనంతరం భూసేకరణకు వెళ్ల వచ్చని ఆయన చెప్పారు. ఇక ఆదిలాబాద్ విమానాశ్రయం మాత్రం రక్షణ శాఖ పరిధిలో ఉందని గుర్తు చేశారు. ఆ శాఖ నుంచి అనుమతి వస్తే.. ఆదిలాబాద్‌లో విమానాశ్రయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. అదీకాక ఆదిలాబాద్‌కు ఓ వైపు చత్తీస్‌గఢ్, మరోవైపు మహారాష్ట్రలు సరిహద్దులు ఉన్నాయన్నారు. దీంతో ఆ దరిదాపుల్లో విమానాశ్రయం లేదని గుర్తు చేశారు. అక్కడ విమానాశ్రయం ఏర్పాటు చేస్తే చాలా మందికి ఉపయోగకరంగా ఉంటుందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కె. రామ్మోహన్ నాయుడు అభిప్రాయపడ్డారు. మరోవైపు వరంగల్ విమానాశ్రయం విషయంలో తెలంగాణ ప్రభుత్వం ప్రో యాక్టివ్‌గా వ్యవహరిస్తూ.. భూసేకరణకు ఇప్పటికే సర్కులర్ సైతం జారీ చేసిందని ఆయన వివరించారు. ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ద్వారా వరంగల్‌లో విమానాశ్రయాన్ని నిర్మిస్తామని ఆయన ప్రకటించారు. ఢిల్లీ పర్యటన కోసం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ సోమవారం హైదరాబాద్ నుంచి బయలుదేరి వెళ్లారు. ఈ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి బిజీ బిజీగా గడుపుతున్నారు. మంగళవారం ఉదయం కేంద్ర పౌర విమానాయానశాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడుతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. అంతకుముందు పౌర విమానయాన శాఖ మంత్రి కార్యాలయానికి సీఎం రేవంత్ రెడ్డి విచ్చేయడంతో.. ఆయనకు ఎదురేగి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇద్దరు ఆలింగనం చేసుకున్నారు. ఆ తర్వాత తన కార్యాలయంలో సీఎం రేవంత్‌తోపాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టిను కేంద్ర మంత్రి శాలువాలతో సత్కరించి.. తిరుమల శ్రీవారి ప్రతిమలను వారికి అందజేశారు. అనంతరం వారు.. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతోపాటు ఆ శాఖకు చెందిన ఇతర ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. తెలంగాణలో కొత్త విమానాశ్రయాలు ఏర్పాటుకు అనుమతి తోపాటు వరంగల్ విమానాశ్రయం అంశాలపై వారు కులంకుషంగా చర్చించారు. ఈ పర్యటనలో పలువురు కేంద్రమంత్రులను సైతం సీఎం రేవంత్ కలవనున్నారు. రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్టులు,నిధులు తదితర అంశాలను ఈ సందర్భంగా వారితో సీఎం చర్చించనున్నారు.

శాడిస్ట్ ముఖ్యమంత్రి

మాజీ సర్పంచ్ ఆత్మహత్యకు కారకుడు

ప్రస్టేషన్‌లో నన్ను తిడుతున్నవ్.. సీఎం రేవంత్‌కు కేటీఆర్ కౌంటర్

హైదరాబాద్, నవంబర్ 26 (ఋషి ప్రతినిధి): తాము ఎవరి కాళ్లు ఒత్తలేదని, లుచ్చ పనులు అసలే చేయలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. నీ లెక్క లుచ్చా పనులు చేసి.. ఆయన కాళ్లు ఒత్తుకుంటూ ఉండే అలవాటు తనది కాదని సీఎం రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు. ప్రస్ట్రేషన్‌లో తనను తిడుతున్నావ్ సరే తనకు ఏమీ ఫరక్ పడదన్నారు. ప్రశ్నిస్తే తాను సైకోనా అని ప్రశ్నించారు. కొండారెడ్డిపల్లిలో నీ కోసం పనిచేసిన మాజీ సర్పంచ్ ఆత్మహత్యకు కారణమయ్యావన్నారు. మరి నువ్వు శాడిస్ట్ వా అని నిలదీశారు. నువ్వు తప్పు చేసి మా మీద రుద్దే ప్రయత్నం చేస్తున్న శాడిస్ట్ ముఖ్యమంత్రివని ఫైరయ్యారు. ఏం చేస్తావో చేసుకో, తాము నీకు భయపడేవాళ్ల కాదన్నారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో పార్టీ నేతలతో కలిసి మీడియాతో మాట్లాడారు. 'మృత్యువుతో పోరాడి చనిపోయిన శైలజకు సంతాపం తెలిపారు. రాహుల్ తిట్టినందుకు రేవంత్ రెడ్డి ప్రస్ట్రేషన్‌లో మాట్లాడుతున్నాడని, చిట్టినాయుడికి చిప్ దొబ్బినట్లు అనిపిసుందని ఎద్దేవా చేశారు. అదానీతో బీఆర్ఎస్ అనుబంధం ఉందని రేవంత్ ఆరోపించాడని, జాతీయ రహదారుల ప్రాజెక్టులు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందా?. రక్షణ శాఖ ప్రాజెక్టులు రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో ఉంటాయా?. ఎంపీగా పనిచేసినోడికి ఈ మాత్రం తెలియదా?. 700 కేవీ ట్రాన్స్‌మిషన్ లైన్ల ప్రాజెక్టు కూడా కేంద్రానిదేనని తెలిపారు. డ్రైపోర్ట్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తారని, కేంద్రం అనుమతి ఇస్తే డ్రైపోర్టు నిర్మాణం జరుగుతుందన్నారు. మైక్రోసాఫ్ట్ నుంచి రెండు దశల్లో ఒకసారి రూ. 15 వేల కోట్లు. రెండోసారి రూ. 16 వేల కోట్ల పెట్టుబడులు తెచ్చామని గుర్తు చేశారు. గతంలో కూడా విప్రో ఛైర్మన్ సత్య నాదెళ్ల అంటూ నవ్వుల పాలు అయ్యావని కేటీఆర్ అన్నారు. మైక్రోసాఫ్ట్ వచ్చాక ఆమెజాన్ వచ్చిందని, ఆమెజాన్ రూ. 36 వేల కోట్లు పెట్టుబడులు పెట్టిందని అన్నారు. మొత్తం రూ. 67 వేల కోట్ల విదేశీ పెట్టుబడులను మేము తీసుకొస్తే నేను అదానీని కలిశాను అని ఫోటో రిలీజ్ చేశాడన్నారు. బరాబర్ దావోస్‌లో కలిశానని, ఆ ఫోటోను నేనే నా ట్విట్టర్‌లో పెట్టాను. నీలాగా ఇంటికి పిలిపించుకుని నాలుగు గంటలు రహస్యంగా కలవలేదు, కోహినూర్ హోటల్‌లో కాళ్లు పట్టుకోలేదు. నాకు నీలాగా లుచ్చా పనులు చేసే అలవాటు లేదు. ఏదీ చేసిన బజాప్తా చేస్తా. అదానీ మేము అసలు ఎంకరేజ్ చేయలేదు. నీ లెక్క లుచ్చా పనులు చేసే.. ఆయన కాళ్లు ఒత్తుకుంటూ ఉండే అలవాటు నాది కాదు. ప్రస్ట్రేషన్‌లో నన్ను తిడుతున్నావ్ సరే నాకు ఏమీ ఫరక్ పడదు. ప్రశ్నిస్తే నేను సైకోనా?. కొండారెడ్డి పల్లిలో నీ కోసం పనిచేసిన మాజీ సర్పంచ్ ఆత్మహత్యకు కారణమయ్యావ్. మరి నువ్వు శాడిస్ట్ వా?. నువ్వు తప్పు చేసి మా మీద రుద్దే ప్రయత్నం చేస్తున్న శాడిస్ట్ ముఖ్యమంత్రివి. ఏం చేస్తావో చేసుకో. నీకు భయపడేవాళ్ల కాదు మేము. కొడంగల్‌లో వృద్ధుడైన సాయిరెడ్డి అనే మాజీ సర్పంచ్‌ని వేధించారు. సాయిరెడ్డి ఇంటిముందు గోడ కడితే బాధతో ఆయన ఆత్మహత్య చేసుకున్నారు. శైలజ కుటుంబానికి పరామర్శకు వెళ్తామంటే మా ఎమ్మెల్యే లక్ష్మిని అడ్డుకున్నారు.

రెండు నెలలైనా ఈడీ లెక్కేది?

ఫొటోలు రాలే.. వీడియోలు రాలే.. కనీసం స్టేట్‌మెంట్ కూడా రాలే : కేటీఆర్

హైదరాబాద్, నవంబర్ 26 (ఋషి ప్రతినిధి): తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి ఇంట్లో ఈడీ దాడులు జరిగి రెండు నెలలైనా ఎలాంటి సమాచారం లేదంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఆ దాడుల గురించి ఏమైనా అప్‌డేట్స్ ఉన్నాయా అంటూ ప్రశ్నించారు. దాడులకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు, కనీసం ఈడీ అధికారుల స్టేట్‌మెంట్లు కూడా ఇప్పటికీ బయటకు రాలేదన్నారు. ఆ రోజు నోట్ల లెక్కింపు కోసం వాడిన రెండు కౌంటింగ్ మెషిన్లు ఏమయ్యాయని నిలదీశారు. ఆ దాడులపై ఎందుకు ఈ నిశ్శబ్దం అంటూ ఎక్స్ వేదికగా మండిపడ్డారు. ఈ ఏడాది సెప్టెంబర్ 27న హైదరాబాద్‌లోని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నివాసంతోపాటు ఆఫీసుల్లో ఈడీ అధికారులు దాడులు నిర్వహించిన విషయం తెలిసిందే. విదేశీ మారక నిల్వల వ్యవహారంలో మిసెస్ జెడ్ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన కార్యాలయాల్లో ఈ నెల 22న ఈడీ దాడులు నిర్వహించింది. ఒడిశా, ఢిల్లీ, గురుగ్రామ్‌తోపాటు 9 చోట్ల ఏకకాలంలో అధికారులు సోదాలు చేశారు. ఈ క్రమంలో రూ.1.39 కోట్లు, రహస్య పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు సోమవారం ఈడీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో మంత్రి పొంగులేటి ఇంట్లో ఐటీ దాడులు జరిగి 2 నెలలైనా ఇప్పటికీ ఎలాంటి సమాచారం లేకపోవడంపై కేటీఆర్ ప్రశ్నించారు.

రామగుండంలో కోటి 30 లక్షల గంజాయి దహనం

రామగుండం, నవంబర్ 26 (ఋషి ప్రతినిధి): పోలీస్ కమిషనరేట్ పరిధి పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలో పట్టుబడ్డ రూ.కోటి 30 లక్షల విలువగల గంజాయిని డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో మానకొండూరు వద్ద పోలీసులు దహనం చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ 2021 నుంచి వివిధ పోలీసు స్టేషన్‌లలో నమోదైన 64 కేసుల్లో నిందితుల నుంచి 521.544 కిలోల ప్రభుత్వ నిషేధిత గంజాయిని స్వాధీనం చేసుకున్నామని వివరించారు. ఎన్‌డీపీఎస్ చట్ట ప్రకారం కోర్టు అనుమతి తీసుకుని, న్యాయాధిపతుల ముందు కేసు ప్రాపర్టీని ఎఫ్ఎస్ఎల్ కోసం శాంపిల్ తీసి మిగిలిన మొత్తాన్ని వెంకటరమణ ఇన్సినేటర్ ఫ్యాక్టరీ వద్ద పర్యావరణ కాలుష్య నియంత్రణ నిబంధనలను పాటిస్తూ దహనం చేశామన్నారు. దహనం చేసిన నిషేధిత గంజాయి విలువ సుమారు రూ. 1,30,38,600 వివరించారు. అక్రమార్జనలో భాగంగా గంజాయి సాగు, విక్రయిస్తూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని యువతను ప్రలోభాలకు గురి చేస్తూ మత్తులోకి దించుతున్నారన్నారు. అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడే వారిని అరికట్టడం కోసం స్థానిక, స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసుల ద్వారా విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఎవరైనా గంజాయి , ఇతర మత్తు పదార్థాలను విక్రయిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

డిజైన్ లేకుండానే సుందిళ్ల 2ఏ బ్లాకు నిర్మాణం

జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు ఇంజినీర్ల వెల్లడి

హైదరాబాద్,నవంబర్26 (ఋషి ప్రతినిధి): సుందిళ్ల బ్యారేజీలోని 2ఏ బ్లాకును డిజైన్ లేకుండానే నిర్మాణం ప్రారంభించినట్టు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు ఇంజినీర్లు తెలిపారు. కాళేశ్వరం కమిషన్ ముందు మంగళవారం 16 మంది క్షేత్రస్థాయి ఇంజినీర్లు విచారణకు హాజరయ్యారు. గతంలో వారు దాఖలు చేసిన అఫిడవిట్ల ఆధారంగా కమిషన్ వారిని ప్రశ్నించింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించిన డిజైన్లు, నాణ్యతకు సంబంధించిన అంశాలపై డీఈ, ఏఈఈలను జస్టిస్ పీసీ ఘోష్ ప్రశ్నించారు.రెండో బ్లాక్‌ను పరిగణనలోకి తీసుకొని సుందిళ్ల బ్యారేజీ 2ఏ బ్లాక్ నిర్మాణాన్ని డిజైన్ లేకుండానే ప్రారంభించినట్టు ఇంజినీర్లు తెలిపారు. అప్పటి చీఫ్ ఇంజినీర్ ఆదేశాల మేరకు పనులు చేపట్టినట్టు పేర్కొన్నారు. డిజైన్లు లేకుండా పనులు ఎలా చేపడతారని జస్టిస్ పీసీ ఘోష్ ఆక్షేపించారు. కొందరు ఇంజినీర్ల సమాధానాలపై అసంతృప్తి వ్యక్తం చేసిన కమిషన్ ఛైర్మన్.. తప్పుదోవ పట్టించవద్దని స్పష్టం చేశారు. అఫిడవిట్‌లో ఒక సమాచారం, విచారణలో మరొక సమాచారం ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బహిరంగ విచారణలో ప్రమాణం చేసి అబద్ధం ఎలా చెబుతారని మండిపడ్డారు. అలా చేస్తే చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పనులకు సంబంధించిన ప్లేస్మెంట్ రిజిస్టర్లు, మెజర్మెంట్ బుక్స్ పై ఇంజనీర్ల సంతకాలు తీసుకొన్న కమిషన్ వాటిని స్వాధీనం చేసుకొంది. బుధవారం మరో 18 మంది ఇంజనీర్లను కమిషన్ విచారించనుంది.

మళ్లీ బీఆర్ఎస్‌లోకి అరూరి రమేష్?

పార్టీ మారతారని జోరుగా ప్రచారం

హైదరాబాద్, నవంబర్ 26 (ఋషి ప్రతినిధి): బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ మళ్లీ పార్టీ మారతారనే ప్రచారం జరుగుతోంది. అరూరి తిరిగి బీఆర్ఎస్ బాట పడుతున్నారనే ప్రచారం జరుగుతోంది. బీజేపీ కార్యక్రమాల్లో ఆయన పెద్దగా పాలుపంచుకోకపోవడం ఈ ప్రచారానికి ఊతం ఇస్తున్నాయి.దాదాపు పదేళ్ల పాటు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేగా కొనసాగి, ఎంపీ ఎలక్షన్స్ కు ముందు బీజేపీలో చేరిన వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ మళ్లీ యూటర్న్ తీసుకోబోతున్నారా? కాషాయ కండువా వదిలి మళ్లీ కారు ఎక్కనున్నారా? వర్ధన్నపేట నియోజకవర్గంలో ఇప్పుడు ఇదే చర్చ జోరుగా నడుస్తోంది. బీజేపీ నుంచి లోక్ సభ బరిలో నిలిచిన ఆయన.. ఆ ఎన్నికల్లో ఓటమి తరువాత ఎక్కడా సరిగా కనిపించకపోవడం, పార్టీ కార్యక్రమాల్లోనూ పెద్దగా పాలుపంచుకోకపోవడం ఆయన పార్టీ

మారబోతున్నారనే ప్రచారానికి కారణం అయ్యాయి. దీంతో మళ్లీ ఆయన బీఆర్ఎస్ కండువా కప్పుకోబోతున్నారనే చర్చకు దారితీశాయి. అధికారికంగా అరూరి నుంచి ఎలాంటి ప్రకటన వెలువడకపోయినా స్థానిక సంస్థల ఎన్నికలకు కాస్త అటుఇటుగా ఆయన పార్టీ మారడం ఖాయమనే ప్రచారం జరుగుతోంది. ఇదే విషయం గురించి ఆయన తన సన్నిహితులతో చర్చించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. అరూరి రమేష్ 2009 ఎలక్షన్స్ టైమ్ లో ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థిగా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి చవిచూశారు. ఆ తరువాత తెలంగాణ ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ పార్టీ నుంచి వర్ధన్నపేట నియోజకవర్గ అభ్యర్థిగా 2014 లో పోటీ చేసి అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి కొండేటి శ్రీధర్ పై దాదాపు 86 వేల ఓట్లకు పైగా మెజారిటీతో విజయం సాధించారు. ఆ తరువాత 2018 ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పగిడిపాటి దేవయ్యపై 99 వేలకు పైగా ఓట్లు సాధించి బంపర్ మెజారిటీతో గెలుపొందారు. ఇలా రెండు సార్లు రికార్డు మెజారిటీతో విజయం సాధించిన ఆయన 2023 అసెంబ్లీ ఎన్నికల్లో లక్షకు పైగా మెజారిటీ సాధిస్తాననే ధీమాతో బరిలో నిలిచారు. కానీ వ్యక్తిగతంగా ఆయన క్యాడర్ పై ఉన్న వ్యతిరేకతతో పాటు కాంగ్రెస్ కు వచ్చిన హైప్ తో ఆయన చిత్తుగా ఓటమి పాలయ్యారు. దాదాపు 19,458 ఓట్ల తేడాతో అరూరి రమేశ్ కాంగ్రెస్ అభ్యర్థి కేఆర్ నాగరాజు చేతిలో ఓటమి చవి చూశారు.అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తరువాత అరూరి రమేశ్ తన వ్యూహం మార్చుకున్నారు. ఎలాగైనా పవర్ లో ఉండాలనే ఉద్దేశంతో ఎంపీగా పోటీ చేసేందుకు నిర్ణయించుకున్నారు. కానీ బీఆర్ఎస్ నుంచి పోటీ చేస్తే లాభం లేదనే ఉద్దేశంతో నాటకీయ పరిణామాల నడుమ బీజేపీ లో చేరారు. అనుకున్నట్టుగానే బీజేపీ నుంచి ఎంపీ టికెట్ తెచ్చుకుని వరంగల్ లోక్ సభ స్థానం నుంచి బరిలో నిలిచారు. ప్రధానిగా మోదీకి ఉన్న క్రేజ్, క్షేత్రస్థాయిలో బీజేపీకి పెరిగిన ఓటు బ్యాంక్ తో ఎంపీగా గెలుపు తనదేనని భావించారు. కానీ పార్టీ మారినా క్షేత్రస్థాయిలో ఆయనతో పాటు ఆయన అనుచరులపై ఉన్న వ్యతిరేకత, అసెంబ్లీ ఎన్నికలతో కాంగ్రెస్ కు పెరిగిన బలం వల్ల ఆయన లోక్ సభ ఎన్నికల్లో కూడా ఓటమి చెందారు. వరంగల్ ఎంపీగా డాక్టర్ కడియం కావ్య గెలవగా.. ఆయన రెండో స్థానానికి పరిమితం అయ్యారులోక్ సభ ఎన్నికల తర్వాత అరూరి కొంతకాలం పార్టీ జిల్లా నేతలు, కార్యకర్తలతో టచ్ లోనే ఉన్నారు.

చిన్నారుల మరణాలన్నీ సర్కారీ హత్యలే

ఫుడ్ పాయిజన్ ఘటనలపై దాసోజు శ్రవణ్ ధ్వజం

విద్యార్థులు చనిపోతున్నా చలనం ఉండదా?

కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరంజన్ రెడ్డి ఆగ్రహం

హైదరాబాద్, నవంబర్ 26 (ఋషి ప్రతినిధి-భాగ్యనగర్): గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలపై బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టళ్లలో మరణమృదంగాలా అని మండిపడ్డారు. ఎవరిదీ పాపమని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. చిన్నారుల మరణాలన్నీ సర్కారీ హత్యలే అని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ఉరఫ్ విద్యాశాఖ మంత్రి రేవంత్ రెడ్డి నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం, అసమర్థత కారణంగా తన సొంత జిల్లాలోని మక్తల్ మండలం మాగనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మళ్లీ ఫుడ్ పాయిజన్ జరిగిందని దాసోజు శ్రవణ్ అన్నారు. మధ్యాహ్న భోజనం తిని పలువురు విద్యార్థులకు వాంతులు, తల నొప్పి, కడుపు నొప్పితో విద్యార్థులు విలవిలలాడిపోయారని పేర్కొన్నారు. మక్తల్ ఆస్పత్రికి 30 మంది విద్యార్థులను తరలించారని తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 48 మంది ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థుల మరణించారని దాసోజు శ్రవణ్ తెలిపారు. తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చారని అన్నారు. ఈ పాపం ఎవరిదీ అని ప్రశ్నించారు. ప్రత్యేక విద్యా శాఖ మంత్రి, పూర్తి బాధ్యతలతో ప్రత్యేక ప్రిన్సిపల్ సెక్రటరీని నియమించకుండా రేవంత్ రెడ్డి నిరంకుశ పరిపాలన కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. ఇంత జరుగుతున్నా ముఖ్యమంత్రి ఢిల్లీలో బిజీ బిజీగా ఉన్నారని.. ప్రిన్సిపల్ సెక్రటరీ హైదరాబాద్‌లో బిజీగా ఉన్నారని.. ఈ ఘటనలపై కనీస రివ్యూ కూడా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తం మీద బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల జీవితాలతో తమ నిర్లక్ష్యంతో, అసమర్థతతో చెలగాటం ఆడుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఘోరనేరానికి పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరిదురా ప్రజాకోర్టులో శిక్షార్హులే అని స్పష్టం చేశారు. విద్యార్థులు మరణిస్తున్నా ఈ ప్రభుత్వంలో చలనం ఉండదా అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు.

మాగనూరు స్కూల్‌లో మళ్లీ..

వికటించిన మధ్యాహ్న భోజనం

21మంది విద్యార్థులకు అస్వస్థత.. వారంలో వరుసగా రెండో ఘటన

ప్రభుత్వ తీరుపై హరీష్‌రావు మండిపాటు

నారాయణపేట,నవంబర్26 (ఋషి ప్రతినిధి): నారాయణపేట జిల్లా మాగనూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో మరోసారి మధ్యాహ్న భోజనం వికటించి 21 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. విద్యార్థులు రోజు మాదిరిగానే మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం తిన్న తర్వాత 21 మంది విద్యార్థులు అస్వస్థతకు గురవడంతో వెంటనే వారిని మాగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గత బుధవారం ఇదే పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించి 50 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనకు కారణాలపై వెంటనే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ప్రధానోపాధ్యాయుడు, ఎంఈవో మురళీధర్‌రెడ్డి, భోజన నిర్వహణ ఇన్‌ఛార్జి హెచ్ఎం బాపురెడ్డిలను సస్పెండ్ చేస్తూ పాఠశాల విద్యా సంచాలకుడు ఈవీ నర్సింహారెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఆ పాఠశాల మధ్యాహ్న భోజన ఏజెన్సీని రద్దు చేశారు. ఆ ఘటన మరువక ముందే మరో 21 మంది విద్యార్థులు ఆసుపత్రి పాలు కావడం గమనార్హం. నారాయణపేట జిల్లా మాగనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరోసారి ఫుడ్‌పాయిజన్ జరగడంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకులు హరీశ్‌రావు తీవ్రంగా మండిపడ్డారు. ఫుడ్‌పాయిజన్ జరిగి 100 మంది విద్యార్థులు అస్వస్థతకు గురై పది రోజులు కూడా గడవకముందే మళ్లీ ఫుడ్‌పాయిజన్ జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు నారాయణపేట జిల్లా మాగనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరోసారి ఫుడ్‌పాయిజన్ జరగడంపై హరీశ్‌రావు తీవ్రంగా మండిపడ్డారు. ఫుడ్‌పాయిజన్ జరిగి 100 మంది విద్యార్థులు అస్వస్థతకు గురై పది రోజులు కూడా గడవకముందే మళ్లీ ఫుడ్‌పాయిజన్ జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాంతులు, కడుపునొప్పితో 30 మంది విద్యార్థులు జిల్లా దవాఖానాలో చేరిన దుస్థితి నెలకొందని అన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో వరుస ఫుడ్ పాయిజన్ కేసులు నమోదవుతున్నా, ప్రాణాలు కోల్పోతున్నా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడటం లేదని హరీశ్‌రావు మండిపడ్డారు. తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా కనీస చర్యలకు ఉపక్రమించడం లేదని విమర్శించారు. విద్యార్థులకు కల్తీ ఆహారం పెడితే జైలుకు పంపిస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి మాటలు నీటి మూటలే అయ్యాయని అన్నారు.

మెట్రోకు 116.4 కి.మీ ప్లాన్

రెండో దశలో 6 కారిడార్లు

సిఎంతో చర్చించామన్న ఎన్‌విఎస్‌రెడ్డి

హైదరాబాద్,నవంబర్26 (ఋషి ప్రతినిధి): ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో హైదరాబాద్ మెట్రో రైలు విజయవంతంగా నడుస్తోందని హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి అన్నారు. మెట్రో రైలు ఏడేళ్లు పూర్తిచేసుకుందని.. ఇది నగర వాసులకే కాకుండా తెలంగాణకు గర్వకారణమని చెప్పారు.'మెట్రో రైలు మొదటి దశ నిర్మాణం సమయంలో నా దిష్టి బొమ్మలు దహనం చేశారు. ముంబయి, చెన్నైలో భారీగా ఖర్చు చేసి మెట్రో విస్తరిస్తున్నారు. దురదృష్టవశాత్తు మన నగరంలో విస్తరణ లేకపోవడం వల్ల మూడో స్థానంలో ఉన్నాం. విస్తరణపై సీఎం రేవంత్ రెడ్డితో సుదీర్ఘంగా చర్చించాం. మొత్తం 3 కారిడార్లు విమానా శ్రయానికి కలిపేలా రెండో దశ ప్రతిపాదనలు సిద్ధం చేశాం. రెండో దశలో ఆరు కారిడార్లతో 116.4 కి.మీ ప్లాన్ చేశాం. ప్రస్తుతం ఐదు కారిడార్లకు డీపీఆర్‌లు సిద్ధం చేసి పంపించాం.

యాదగిరిగుట్టలో డ్రగ్స్ కలకలం

యాదగిరిగుట్ట, నవంబర్26 (ఋషి ప్రతినిధి): డ్రగ్స్ మహమ్మారి ఇప్పుడు యాదగిరిగుట్టను కూడా తాకింది. ఎవ్వరూ ఊహించని విధంగా యాదగిరిగుట్ట మండలం రామాజీపేట యాదాద్రి లైఫ్ సైన్సెస్ కెమికల్ ఫ్యాక్టరీలో భారీగా డ్రగ్స్ తయారు చేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. పోలీసుల అదుపులో ఆరుగురు నిందితులు ఉన్నట్లు సమాచారం.యాదగిరిగుట్ట నుండి హైదరాబాద్ తరలిస్తుండగా భువనగిరి మండలం గూడూరు టోల్ గేట్ వద్ద పోలీసులకు పట్టుబడ్డ డ్రగ్స్ ముఠా సభ్యులు. గతకొంత కాలంగా గుట్టు చప్పుడు కాకుండా ఎఫిడ్రిన్ అనే డ్రగ్ తయారీ చేస్తున్నట్లు సమాచారం

ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుపతి, నవంబర్ 26 (ఋషి ప్రతినిధి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. టీటీడీ జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం పాల్గొన్నారు. ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామార్చన, శుద్ధి నిర్వహించారు. అనంతరం ఉదయం 6 నుంచి 9 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టారు. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణంతో పాటు పలు సుగంధ ద్రవ్యాలు కలిపిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. ఈ కారణంగా కల్యాణోత్సవం, ఊంజల్‌సేవను రద్దు చేశారు.

పరదాలు విరాళం

ఈ సందర్భంగా ఆలయానికి హైదరాబాదుకు చెందిన స్వర్ణకుమార్ రెడ్డి ఆరు పరదాలు, రెండు కురాళాలు, తిరుపతికి చెందిన సుధాకర్, జయ చంద్రారెడ్డి, అరుణ్ కుమార్ నాలుగు పరదాలు 25 హుండీ వస్త్రాలు విరాళంగా జేఈవో వీరబ్రహ్మంకు అందించారు.

నవంబరు 28 నుంచి బ్రహ్మోత్సవాలు

శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు నవంబరు 28 నుంచి డిసెంబరు 6వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. ఇందుకోసం నవంబరు 27వ తేదీన ఉదయం లక్ష కుంకుమార్చన, సాయంత్రం అంకురార్పణ నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు ఆలయ మాడ వీధుల్లో వాహనసేవలు జరుగనున్నాయి.

తరుముకొస్తున్న పెను తుఫాను

ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం

ఏపీలో 3 రోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు

అమరావతి, నవంబర్ 26 (ఋషి ప్రతినిధి): ఏపీని వానలు ఇప్పట్లో వదిలేలా లేవు. చలికాలం ప్రారంభమైనా వానల జోరు తగ్గడం లేదు. దక్షిణ అండమాన్ సముద్రంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడిన సంగతి తెలిసిందే. దీని ప్రభావంతో ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రస్తుతం స్థిరంగా కొనసాగుతోంది. ఇది ఆదివారం రాత్రికి తీవ్ర అల్పపీడనంగా మారింది. ఇది పశ్చిమ నుంచి వాయవ్య దిశగా కదులుతుంది. క్రమంగా బలపడుతూ దక్షిణ బంగాళాఖాతంలో సోమవారం నాటికి వాయుగుండంగా మారనున్నట్లు విశాఖ వాతావరణ కేంద్రం పేర్కొంది. దీని ప్రభావంతో తుపాను సంభవించే అవకాశం ఉన్నట్లు హెచ్చరికలు జారీ చేసింది. వాయుగుండం ప్రభావంతో బుధవారం నుంచి శనివారం వరకు కోస్తా జిల్లాల్లో ఆయా ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలుతేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని కురిసే అవకాశం ఉంది. ఈ క్రమంలో వాతావరణ కేంద్రం రైతులు, జన సామాన్యాన్ని అప్రమత్తం చేసింది. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. అనంతరం ఇది వాయవ్య దిశగా కదులుతూ బుధవారం (నవంబర్ 27) సాయంత్రానికి తమిళనాడు నుంచి శ్రీలంక తీరాలు వైపు వెళ్లనుంది. అక్కడ శ్రీలంక సమీపంలో తీరం దాటే సూచనలు ఉన్నాయని వాతావరణ కేంద్రం వెల్లడించారు. ఇక వాయుగుండం ప్రభావంతో దక్షిణ కోస్తా జిల్లాల్లో సోమవారం నుంచి వర్షాలు కురవనున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెల్పింది. వాయుగుండం ప్రభావంతో నవంబర్ 27నుంచి నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కరిసే ఛాన్స్ ఉన్నట్లు సూచించింది. అటు రాయలసీమ జిల్లాలో చెదురుమదురు వర్షాలు పడే సూచనలున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. దక్షిణ కోస్తా తీరప్రాంతంలో బలమైన గాలులు వీస్తున్నాయని, వీటి ప్రభావంతో సముద్రం అల్లకల్లోలంగా మారినట్లు పేర్కొంది. తీరం వెంబడి గంటకు 35 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తున్నాయి. గరిష్టంగా 65 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని స్పష్టం చేసింది. అందువల్ల మంగళవారం నుంచి సముద్రం అలజడిగా ఉంటుందని, ఈ నెల 29వ తేదీ వరకూ మత్స్యకారులు ఎవ్వరూ వేటకు వెళ్లరాదని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం అధికారులు సూచించారు. ఇదిలా ఉంటే మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా చలిగాలులు విజృభిస్తున్నాయి. ఇప్పటికే ఉదయం పూట చలి తీవ్రత అధికంగా ఉంటుంది. మునుపెన్నడూ లేనివిధంగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రానున్న రోజుల్లో చలి మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు వాతావరణ కేంద్రం హెచ్చరించింది. అటు తెలంగాణలోనూ చలి రోజురోజుకీ పెరిగిపోతుంది.

ఫీజు రీయింబర్స్‌మెంట్ కొనసాగుతుంది

మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి

అమరావతి, నవంబర్ 26 (ఋషి ప్రతినిధి): యేటా విద్యార్థులకు చెల్లిస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని కూటమి ప్రభుత్వం కొనసాగిస్తుందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి స్పష్టం చేశారు. గతంలో విద్యార్థుల తల్లి ఖాతాకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులు చేసేవారని, ఇకపై కాలేజీల యాజమాన్యాల ఖాతాలకే నేరుగా జమ చేస్తామని తెలిపారు. ఈ మేరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలుపై శాసనమండలి సభ్యుల ప్రశ్నలకు మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన అసెంబ్లీతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వం తల్లుల ఖాతాలో నగదు జమచేసే విధానం తీసుకొచ్చినా.. ఫీజులు చెల్లించకుండా ఎగ్గొట్టిందని ఆయన ఆరోపించారు. తొలుత తల్లి ఖాతాలో, ఆ తర్వాత తల్లి-విద్యార్థిలకు కలిపి జాయింట్ ఖాతాలో నగదు జమ చేయడం వల్ల పలు ఇబ్బందులు ఎదుర్కోవల్సి వచ్చిందని చెప్పారు. ఇకపై ఈ విధానానికి స్వస్తి పలికనున్నామని, గతంలో మాదిరిగానే ఈ ఏడాది నుంచి విడతల వారీగా విద్యార్థుల ఫీజుల బకాయిలు నేరుగా కాలేజీల యాజమన్యం ఖాతాలకు మళ్లిస్తామని అన్నారు. మరోవైపు పీజీ చదివే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడంపై ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. అయితే గత ప్రభుత్వం మాత్రం మెస్ ఛార్జీలు, ట్యూషన్ ఫీజులను సగం కూడా చెల్లించలేదని, వారి చర్యల వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవల్సి వచ్చిందని ఆయన అన్నారు. ఇకపై ఈ విధానాలన్నింటికీ స్వస్తి పలికి విద్యార్థులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి అన్నారు. దివ్యాంగుల రిజర్వేషన్ విధానానికి సంబంధించి కేంద్రప్రభుత్వం కొన్ని కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. కనీసం 40 శాతం అంగవైకల్యం ఉన్నవారికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించేందుకు.. ఖాళీలను ఎప్పటికప్పుడు గుర్తించేందుకు వీలుగా వీటిని రూపొందించింది. ఖాళీలను బట్టి వారికి పోస్టులను గుర్తించడం, రిజర్వేషన్ కల్పించడంతో పాటు ఈ ప్రక్రియను మదింపు చేయడానికి కమిటీలను ఏర్పాటు చేయడం తప్పనిసరి చేసింది. అలాగే ప్రత్యక్ష నియామకాల్లో దివ్యాంగులకు 4% రిజర్వేషన్‌ను తప్పనిసరిగా అమలు చేయడాన్ని తీసుకువచ్చింది. బ్యాక్‌లాగ్ పోస్టులను ఎప్పటికప్పుడు భర్తీ చేయాలని పేర్కొంది. ఈ ఆదేశాలు తక్షణం అమల్లోకి వస్తాయని.. ఏదైనా పోస్టు దివ్యాంగులకు సరిపోతుందని భావిస్తే.. వెంటనే ఆ పోస్టులో ఉన్న వ్యక్తి పదోన్నతి కల్పించాలని, తద్వారా అన్ని పోస్టులనూ రిజర్వ్ చేయాలని మార్గదర్శకాల్లో పేర్కొంది.

జగన్‌కు ఆదానీ ముడుపులు!

సిఎంతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం.. ఢిల్లీ పర్యటనలో బిజీగా డిప్యూటి సిఎం పవన్

కేంద్రమంత్రులతో వరుస భేటీలు

న్యూఢిల్లీ,నవంబర్26 (ఋషి ప్రతినిధి): జగన్‌కు అదానీ ముడుపుల వ్యవహారంపై సీఎం చంద్రబాబుతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. హోంశాఖ, శాంతిభద్రతలు తన పరిధిలో లేవని చెప్పారు. దిల్లీలో కేంద్రమంత్రులను కలిసిన అనంతర మీడియాతో ఆయన మాట్లాడారు. 'మమ్మల్ని ఇబ్బంది పెట్టిన వారిని ఎందుకు పట్టుకోవట్లేదని మీడియా అడుగుతోంది. వారిని పట్టుకోవడంలో తటపటాయింపు ఎందుకని ప్రశ్నిస్తున్నారు. పోలీసులను వారి పనులను చేసుకోనివ్వండి.. నా పని నేను చేస్తా. హోం శాఖ, శాంతి భద్రతలు నా పరిధిలో లేవు. నేనేం మాట్లాడినా బాధ్యతగా మాట్లాడాలి. మీడియా నన్ను అడిగిన ప్రశ్నలను సీఎం దృష్టికి తీసుకెళ్తాను. గత ప్రభుత్వంలో బాధ్యత, జవాబుదారీతనం, పారదర్శకత లేవు' అని పవన్ విమర్శించారు. అంతకుముందు కేంద్రమంత్రులు గజేంద్రసింగ్ షెకావత్, సీఆర్ పాటిల్‌తో పవన్ సమావేశమయ్యారు. రాష్ట్రంలో పర్యాటకానికి సంబంధించి కొన్ని అంశాలను షెకావత్ వద్ద ప్రస్తావించినట్లు తెలిపారు. టూరిజం ప్రాజెక్టులు, పర్యాటక వర్సిటీ వంటి 7 అంశాలపై మాట్లాడినట్లు చెప్పారు. వీటికి ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. అనంతరం సీఆర్ పాటిల్‌తో సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ రక్షిత మంచినీరు ఇవ్వాలనేది ప్రధాని మోదీ లక్ష్యమని పేర్కొన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో నీటి సమస్యలకు సంబంధించిన పలు అంశాల తన దృష్టికి వచ్చినట్లు చెప్పారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతున్నామన్నారు. భేటీ ముగిసిన అనంతరం పవన్ ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ..

గజేంద్ర సింగ్ అంటే అపారమైన గౌరవం ఉందని, ఆయన జలశక్తి మంత్రిగా పోలవరం ప్రాజెక్టుకు సహకరించారని అన్నారు. పర్యాటక రంగంలో 7 ప్రాజెక్టులపై ప్రతిపాదనలు అందించామని, ఆంధ్రప్రదేశ్‌కు 975 కిలోమీటర్ల సుదీర్ఘ సముద్ర తీరం ఉందని, గండికోట ఇండియన్ గ్రాండ్ కేనియన్‌లా అభివృద్ధి చేయవచ్చునని అన్నారు. రాష్ట్రంలో పర్యాటక విశ్వవిద్యాలయం పెట్టాలని కోరామని.. దీనిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు.. పెండింగ్ ప్రాజెక్టులు.. ఇతర అంశాలపై వారితో చర్చలు జరిపామన్నారు. బుధవారం ఉదయం పార్లమెంట్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పవన్ కళ్యాణ్ భేటీకానున్నారు. కాగా ఏపీ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పవన్ కల్యాణ్ రెండో సారి ఢిల్లీకి వచ్చారు. కొద్ది రోజుల కిందట ఆయన ఢిల్లీ వెళ్లి కేంద్రమంత్రి అమిత్ షాతో సమావేశం అయ్యారు. మహారాష్ట్ర ఎన్నికల్లో ప్రచారం కోసం ఆయనను అమిత్ షా పిలిచినట్లుగా సమాచారం. ఆ తర్వాత ఇప్పుడు మరోసారి ఢిల్లీకి వచ్చారు.కాగా రాష్ట్రంలో పర్యాటకరంగ అభివృద్ధికి అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని, ఏపీని టూరిజం హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ప్రపంచంలో ఎన్నో దేశాలు కేవలం టూరిజం ద్వారానే అభివృద్ధి చెందాయని చెప్పారు. ఏటా పది శాతం అభివృద్ధికి అవకాశం ఉన్న పర్యాటక రంగాన్ని సీఎం చంద్రబాబు మార్గదర్శకత్వంలో ముందుకు తీసుకువెళ్తామన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఇప్పటికే పర్యాటక రంగ అభివృద్ధికి కీలక నిర్ణయాల తీసుకున్నట్లు వెల్లడించారు. సోమవారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో టెంపుల్, ఎకో, అడ్వెంచర్, హెరిటేజ్ టూరిజం అభివృద్ధికి కార్యాచరణ, పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి ఇచ్చిన హామీల అమలుపై సహచర మంత్రులు, అధికారులతో పవన్ కల్యాణ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ 'రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి ఉన్న ప్రతి అవకాశాన్నీ వినియోగించుకోవాలి. కర్నూలు జిల్లా ఆదోని, దొండపాడు, ఉమ్మడి కడప జిల్లా సిద్ధవటం లాంటి ప్రాంతాల్లో విద్యార్థుల కోసం అడ్వెంచర్ థీమ్ పార్క్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది. ఎకో టూరిజానికి సంబంధించి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు చర్యలు ప్రారంభించాం' అన్నారు. 'కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో విద్యార్థుల కోసం అడ్వెంచర్ థీమ్ పార్కులు ఏర్పాటు చేశారు. అలాంటి థీమ్ పార్కులు మన రాష్ట్రంలో కూడా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి. నంద్యాలలో ఏనుగుల క్యాంపులు ఉన్నాయి. గండికోట, హార్స్‌లీహిల్స్‌లో అద్భుతమైన కొండ ప్రాంతాలున్నాయి. సినిమాల ద్వారా పర్యాటక ప్రాంతాలకు సులువుగా ప్రచారం కల్పించవచ్చు. ఒక సినిమాలో ఒక స్పాట్‌ను ప్రమోట్ చేస్తే అదే కరపత్రంగా మారుతుంది. కుంకీ ఏనుగుల కోసం కర్ణాటక వెళ్లినపుడు ఆ రాష్ట్ర అటవీశాఖ మంత్రి శ్రీశైలానికి కాలినడకన వచ్చే భక్తుల ప్రస్తావన తెచ్చారు. వారికి గతంలో ఉండే సౌకర్యాలు ప్రస్తుతం తీసేశారని ఆయన చెప్పారు. సీఎంతో సమావేశం సందర్భంగా అటవీశాఖ అధికారులు మా దృష్టికి తెచ్చిన టూరిజం పోలీసింగ్ అంశం కూడా చర్చకు వచ్చింది. మన దగ్గర దేవాలయాలు అంటే పిక్నిక్ స్పాట్స్‌లా మారిపోయాయి. ఆలయాల పవిత్రతను కాపాడేలా చర్యలు తీసుకోవాలి. ఆలయ ప్రాంగణాల్లో క్రమశిక్షణ, డ్రెస్‌కోడ్ వంటి వాటిపై అవగాహన కల్పించాలి. హెరిటేజ్ ప్రాంతాలను గత పాలకులు తమ స్వార్థానికి తవ్వేశారు. వాటిని గుర్తించి, కాపాడుకోవాలి. ముఖ్యంగా పర్యాటకుల భద్రత చాలా అవసరం' అని పవన్ అధికారులకు దిశానిర్దేశంచేశారు.

పర్యాటక ప్రాజెక్టులకు సాయం

పిఠాపురంకు ఆర్వోబీ, ఏపీలో ఏఐఐబీ ప్రాజెక్టులు పాడిగించాలి

కేంద్ర మంత్రులకు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ విజ్ఞప్తి

ఢిల్లీలో జనసేనాని బిజీబిజీ

న్యూఢిల్లీ, నవంబర్ 26 (ఋషి ప్రతినిధి): జనసేన అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఢిల్లీలో బిజీబిజీగా ఉన్నారు. పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అయ్యారు. పిఠాపురంలో ఆర్వోబీ, రైళ్లకు హాల్టింగ్ కల్పించాలని విజ్ఞప్తి చేవారు. ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు రుణం గడువును 2026వరకు పొడిగించాలని కోరారు. పిఠాపురం మున్సిపాలిటీ పరిధిలో సామర్లకోట %-% ఉప్పాడ రోడ్డులో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం అవసరం ఉందని, సత్వరమే ఈ ఆర్వోబీని మంజూరు చేయాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రికి పవన్ కల్యాణ్ విజ్ఞప్తి చేశారు. పలు రైల్వే ప్రాజెక్టులు, ప్రజల అవసరాల గురించి చర్చించారు. 'పిఠాపురం పట్టణ పరిధిలోని సెక్షన్‌లో, సామర్లకోట-ఉప్పాడ రోడ్డులో రైల్వే కి.మీ 640/30-32 వద్ద లెవెల్ క్రాసింగ్ నంబర్ 431కి బదులుగా ఆర్‌ఓబీ అవసరమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. నిరంతరంగా ఉండే ట్రాఫిక్ రద్దీని పరిష్కరించడానికి, ఆ ప్రాంతంలో రోడ్ కనెక్టివిటీని మెరుగుపరచడానికి ఈ మౌలిక సదుపాయాల కల్పన చాలా అవసరం. ఈ ప్రాజెక్టును ప్రధానమంత్రి 'గతి శక్తి' కార్యక్రమం ద్వారా మంజూరు చేయాల'ని కోరారు. అదే విధంగా పిఠాపురంలోని శ్రీపాద వల్లభ స్వామి దేవాలయానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం నాలుగు ముఖ్యమైన రైళ్ళకు పిఠాపురం రైల్వే స్టేషన్లో హాల్ట్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. నాందేడ్ - సంబల్పూర్ నాగావళి ఎక్స్ ప్రెస్, నాందేడ్ - విశాఖపట్నం సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్, విశాఖపట్నం- సాయి నగర్ షిర్డీ ఎక్స్ ప్రెస్, ఏపీ ఎక్స్ ప్రెస్ (విశాఖపట్నం - న్యూఢిల్లీ)కి పిఠాపురంలో హాల్ట్ అవసరమని తెలిపారు.మహారాష్ట్ర ఎన్నికల ప్రచారం సందర్భంగా లాతూరు ప్రజలు చేసిన విన్నపాన్ని రైల్వే శాఖ మంత్రి ముందు ఉంచారు. లాతూరు నుంచి తిరుపతికి రైలు ఏర్పాటు చేయాలని కోరిన విషయాన్ని తెలుపుతూ ఈ ప్రతిపాదనపై పరిశీలన చేయాలని కోరారు.ఢిల్లీ పర్యటనలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో పవన్ సమావేశమయ్యారు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంత రహదారుల అభివృద్ధికి ఏఐఐబీ రుణంలో వెసులుబాట్లు కోరారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ రోడ్ల ప్రాజెక్ట్ (ఏపీఆర్ఆర్‌పీ) కోసం ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ %౮% ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) నుంచి తీసుకొన్న రుణానికి సంబంధించి ప్రాజెక్టును 31 డిసెంబర్ 2026 వరకు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. ఏపీ గ్రామీణ రహదారి ప్రాజెక్ట్‌లో మార్పుల కోసం విన్నవించారు. ప్రాజెక్టు పూర్తి చేసేందుకు 31 డిసెంబర్, 2024 వరకు ఇచ్చిన ప్రస్తుత గడువు సరిపోదని రుణ ఒప్పందంలో పేర్కొన్న ప్రకారం రీయింబర్స్‌మెంట్ పద్ధతిలో కాకుండా ముందస్తు చెల్లింపు పద్ధతిలో కొనసాగించాలని కోరారు. డిసెంబర్ 2026 వరకు ప్రాజెక్ట్ పొడిగింపు ఇవ్వాలని కోరారు. నిధుల చెల్లింపుల విధానంలో మార్పులు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఉన్న 70% :30 పన్నులు ప్రభుత్వం) విధానం నుంచి 90 :10% (ప్రభుత్వం) మార్పు చేసి.. 455 మిలియన్ %ఖా% డాలర్ల (అంటే రూ. 3834.52 కోట్లు) బ్యాంక్ ఒప్పుకొన్న మేరకు వాటాను కొనసాగిస్తూ నిధుల విడుదలను మార్పును పరిగణనలోకి తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. జల జీవన్ మిషన్ (జె.జె.ఎం.) యొక్క నిజమైన స్ఫూర్తిని సాధించాలంటే... బోరు బావులపై ఎక్కువగా ఆధారపడకుండా.. దీర్ఘకాలిక, నిలకడతో ఉన్న వనరుల నుంచి నీటిని సేకరించడం చాలా కీలకం. ఆ దిశగా ఆంధ్ర ప్రదేశ్ లోని కూటమి ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, ఆర్.డబ్ల్యూ.ఎస్. శాఖల మంత్రి పవన్ కల్యాణ్ కేంద్ర మంత్రికి వివరించారు.ఢిల్లీలో కేంద్ర జల శక్తి శాఖ మంత్రి సి.ఆర్.పాటిల్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో జె.జె.ఎం. అమలుపై చర్చించారు. '2019-2024 మధ్య అందించిన కనెక్షన్లలో కుళాయిల సామర్థ్యం, నీటి నాణ్యత అంశంలో ఇటీవల చేసిన సర్వే ద్వారా పలు సమస్యలను గుర్తించామ'ని కేంద్ర మంత్రికి తెలిపారు. సర్వే ఫలితాల ప్రకారం 29.79 లక్షల కుటుంబాలకు ట్యాప్ కనెక్షన్లు అందలేదనీ, అలాగే 2.27 లక్షల పంపులు పని చేయడం లేదని. మరో 0.24 లక్షల ట్యాపులు అవసరమైన స్థాయిలో నీటిని సరపరాచేయడం లేదని వివరించారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నీటి సరఫరా, తగినంత మేర సరఫరా (ప్రతి వ్యక్తికి రోజుకి 55 లీటర్లు), నాణ్యమైన నీటిని అందించాలన్న లక్ష్యాలను ఇంకా సాధించలేదని సర్వే ద్వారా తేలిందని చెప్పారు.రాష్ట్రానికి మకుటాయమానంగా నిలిచే పర్యటక ప్రాజెక్టులకు కేంద్రం తగిన విధంగా సహకరించి, వాటి అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని పవన్ కళ్యాణ్ కేంద్ర పర్యటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను కోరారు.

రాష్ట్రంలో రాజ్యాంగ వ్యతిరేక పాలన: అంబటి

అమరావతి, నవంబర్ 26 (ఋషి ప్రతినిధి): రాష్ట్రంలో రాజ్యాంగ వ్యతిరేక పాలన సాగుతోందని మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను పక్కనబెట్టి కక్ష సాధింపు చర్యలకే పరిమితమైందని విమర్శించారు. లోకేశ్ రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందని అన్నారు. లోకేశ్ చెప్పిన విధంగా పోలీసులు నడుస్తున్నారని మండిపడ్డారు. తమ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్రూట్ మెజారిటీ వచ్చింది కాబట్టి తమకు తిరుగులేదని.. పోలీసులు తాము ఏం చెబితే అది చేయాలన్నట్లుగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందని అంబటి రాంబాబు తెలిపారు. ఎవర్ని పట్టుకురావాలంటే వారిని పోలీసులు పట్టుకురావాలి.. ఎవర్ని లోపల వేయమంటే వాళ్లను లోపల వేయాలన్నట్లుగా నడుస్తోందని విమర్శించారు. ఒక్కొక్క వ్యక్తి మీద ఒకటి రెండు కేసులు కాదు.. 15 కేసులు, 20 కేసులు, 30 కేసులు అని పోలీస్ స్టేషన్లు, న్యాయస్థానాలు తిప్పుతూ హింసిస్తున్నారని మండిపడ్డారు. బహుశా బ్రిటీష్ వారి పరిపాలన చేసే రోజుల్లో కూడా స్వాతంత్ర్యం కోసం పోరాడిన వారిపై ఇన్ని కేసులు పెట్టి ఉంటారని అనుకోవడం లేదని ఎద్దేవా చేశారు. మీడియా, సోషల్‌మీడియాపై అణిచివేత ధోరణిలో కూటమి ప్రభుత్వ నేతలు వ్యవహరిస్తున్నారని అంబటి రాంబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.

వైఎస్ జగన్‌పై ఏసీబీకి ఫిర్యాదు

అదానీ లంచం వ్యవహారంపై కంప్లెయింట్

జగన్‌కు 1750 కోట్లు ఇచ్చారని ఆరోపణ

అమరావతి, నవంబర్ 26 (ఋషి ప్రతినిధి): వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏసీబీకి ఫిర్యాదు అందింది. అదానీ సంస్థ లంచం ఇచ్చిన వ్యవహారంపై సెంటర్ ఫర్ లిబర్టీ సంస్థ వ్యవస్థాపకుడు చక్రవర్తి ఈ మేరకు మంగళవారం ఏసీబీకి ఫిర్యాదు చేశారు. జగన్‌కు 1,750 కోట్లు లంచం ఇచ్చినట్లు ఫిర్యాదుదారుడు ఆరోపించారు. సెకీతో అదానీ కంపెనీ విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందంపై విచారణ జరపాలని ఆయన కోరారు. జగన్‌కు అదానీ సంస్థ లంచం ఇచ్చినట్లు అమెరికా విచా రణలో తేలిందని వెల్లడించారు. ఒప్పందానికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలి : షర్మిల

అదానీతో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో చేసుకున్న విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. అక్రమ డీల్‌తో 25 ఏళ్ల పాటు ఆంధ్ర రాష్ట్ర ప్రజలపై పడే భారం రూ.1.50 లక్షల కోట్లు అని.. ఈ డీల్‌ను వెంటనే రద్దు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడికి సుదీర్ఘ లేఖను రాశారు. అదానీతో జగన్ చేసుకున్నది అక్రమ ఒప్పందం అని షర్మిల ఆరోపించారు. దీనివల్ల 25 ఏళ్ల పాటు ఆంధ్ర రాష్ట్ర ప్రజలపై పడే భారం 1.50 లక్షల కోట్లు అని అన్నారు. విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందంలో అదానీ నుంచి రూ.1750 కోట్ల ముడుపులు అందుకున్న జగన్‌పై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సీబీఐతో లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

ఆర్జీవీ ముందస్తు బెయిల్‌పై విచారణ వాయిదా

అమరావతి, నవంబర్ 26 (ఋషి ప్రతినిధి): వివాదాస్పద దర్శకుడు రామ్‌గోపాల్ వర్మకు ఏపీ హైకోర్టులో చుక్కెదురైంది. ఆర్జీవీ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లపై విచారణను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రేపటికి వాయిదా వేసింది. దీంతో నవంబర్ 27న ఆర్జీవీ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరగనుంది. మరోవైపు ఆర్జీవీ ఆచూకీ కోసం రెండు బృందాలుగా ఏపీ పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నా యి. దీంతో ఆయన ఎక్కడ? తెలుగు స్టేట్స్‌లోనే ఉన్నారా?. అసలు ఎక్కడున్నారు?. ఇది కనిపెట్టే పనిలో ఉన్నారు ఏపీ పోలీసులు.ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లపై సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు పెట్టారన్న దానిపై ఒంగోలు, విశాఖ, గుంటూరు జిల్లాలో వేరువేరుగా ఆర్జీవీపై పోలీస్ స్టేషన్లో కేసులు ఫైల్ అయిన సంగతి తెలిసిందే. ఒంగోలులో నమోదైన కేసుకు సంబంధించి ఇప్పటికే ఆయనకు రెండు సార్లు నోటీసులు ఇచ్చినా హాజరుకాలేదు. దీంతో ఏపీ పోలీసులు ఆయనను వెతికే పనిలో పడ్డారు. ఆర్జీవీ తనపై నమోదైన కేసుల్లో ముందస్తు బెయిల్ కోరుతూ హైకోర్టులో వేసిన పిటిషన్ రేపటికి వాయిదా వేసింది. ఆర్జీవీ కోసం ప్రకాశం జిల్లా పోలీసులు హైదరాబాద్, తమిళనాడులో వేట సాగిస్తున్నారు. ఒంగోలు విచారణకు డుమ్మా కొ

ఫడణవీసే సీఎం: సంజయ్ రౌత్

ముంబై, నవంబర్ 26 (ఋషి ప్రతినిధి): మహారాష్ట్ర ముఖ్యమంత్రి అంశంపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఇటీవలే జరిగిన ఎన్నికల్లో మహాయుతి కూటమి ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ప్రస్తుత అసెంబ్లీ గడువు నేటితో ముగియనుంది. ఇప్పటి వరకూ సీఎం ఎవరన్నదానిపై స్పష్టత రాలేదు. ఈ నేపథ్యంలో శివసేన (యూటీబీ) నేత సంజయ్ రౌత్ కీలక వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్ర తదుపరి ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కావొచ్చని తన అభిప్రాయం వ్యక్తం చేశారు. 'మహారాష్ట్ర తదుపరి ముఖ్యమంత్రిని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా నిర్ణయిస్తారు. ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్ ఇద్దరూ తమ పార్టీల కోసం సొంతంగా నిర్ణయాలు తీసుకోలేరు. ఈ రెండు పార్టీలు మోదీ, షా కనుసన్నల్లోనే నడుస్తాయి. ప్రస్తుతం బీజేపీకే అధిక మెజారిటీ ఉంది. కాబట్టి షిండే, పవార్‌కు సీఎం అయ్యే అవకాశం లేదు. నా అభిప్రాయం ప్రకారం.. మహా తదుపరి ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కావొచ్చు' అని రౌత్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ నెల 20న జరిగిన ఎన్నికల్లో బీజేపీకి 132, శివసేనకు 57, ఎన్సీపీకి 41 స్థానాలు లభించిన విషయం తెలిసిందే.

4 రాష్ట్రాల్లో త్వరలో రాజ్యసభ ఉప ఎన్నికలు

షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల సంఘం

న్యూఢిల్లీ, నవంబర్ 26 (ఋషి ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ సహా నాలుగు రాష్ట్రాల్లో త్వరలో రాజ్యసభ ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఏపీ, ఒడిశా, పశ్చిమ బెంగాల్, హర్యాణా రాష్ట్రాల్లో ఖాళీ అయిన ఆరు స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎన్నికల సంఘం మంగళవారం షెడ్యూల్ విడుదల చేసింది. ఈసీ రిలీజ్ చేసిన షెడ్యూల్ ప్రకారం.. డిసెంబర్ 3వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. డిసెంబర్ 10ని నామినేషన్లకు చివరి తేదీగా నిర్ణయించారు. డిసెంబర్ 11న నామినేషన్ల పరిశీలన, 13వ తేదీ నామినేషన్ల ఉపసంహరణకు చివరి గడువు. డిసెంబర్ 20వ తేదీన పోలింగ్ ఉంటుంది. అదే రోజు సాయంత్రం కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు వెల్లడిస్తారు. కాగా, ఏపీలో మోపిదేవి వెంకటరమణా రావు, బీద మస్తాన్‌రావు, ఆర్ కృష్ణయ్య రాజీనామాలతో మూడు రాజ్యసభ స్థానాలు ఖాళీ అయిన విషయం తెలిసిందే.

మోదీ రాజ్యాంగాన్ని పూర్తిగా చదవలేదు: రాహుల్

న్యూఢిల్లీ, నవంబర్ 26 (ఋషి ప్రతినిధి): ప్రధాని నరేంద్ర మోదీ కచ్చితంగా రాజ్యాంగాన్ని చదవలేదని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన సంవిధాన్ రక్షక్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ రాజ్యాంగాన్ని చదవలేదన్న గ్యారెంటీ ఇవ్వగలనని అన్నారు. ఒకవేళ ఆయన ఈ పుస్తకాన్ని చదివి ఉంటే, ప్రతి రోజు ఇలాంటి పనులు చేసేవాడు కాదు అని రాహుల్ అన్నారు. సంవిధాన్ రక్షక్ అభియాన్‌లో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసిందని, కులగణన అనేది సమాజానికి మెగా హెల్త్ చెకప్ లాంటిందని ఆయన అన్నారు. రాజ్యాంగాన్ని రక్షించేది గాంధీ కుటుంబం మాత్రమే అని ఆయన పేర్కొన్నారు. మేం అంతా ఆ కుటుంబం వైపు మద్దతుగా ఉన్నామన్నారు.

క్షీణించిన ఆర్బీఐ గవర్నర్ ఆరోగ్యం!

చెన్నై అపోలో ఆస్పత్రిలో చేరిన శక్తికాంతదాస్

అసిడిటీతో బాధపడుతున్నట్లు తెలిపిన డాక్టర్లు

న్యూఢిల్లీ, నవంబర్ 26 (ఋషి ప్రతినిధి): భారత రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ ఆరోగ్య సమస్యతో చెన్నైలోని ఆస్పత్రిలో చేరారు. ఆయన చిన్నపాటి సమస్యతో అపోలో ఆసుపత్రిలో చేరారు. ఈ మేరకు అపోలో ఆసుపత్రి వర్గాలు ఒక ప్రకటన విడుదల చేసింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ శక్తికాంత దాస్ అసిడిటీతో బాధపడుతున్నారని, చికిత్స కోసం చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో చేరినట్లు పేర్కొంది. ప్రస్తుతం అతను బాగానే ఉన్నారని, మరో 2-3 గంటల్లో డిశ్చార్జ్ అవుతారని వెల్లడించింది. అతని ఆరోగ్యానికి సంబంధించిన ప్రకటన కూడా విడుదల చేశారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ శక్తికాంత దాస్ అసిడిటీతో బాధపడుతున్నట్లు తెలిపింది. వైద్య పరీక్షల కోసం చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో చేరారని చెప్పారు.ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని ఆర్బీఐ అధికార ప్రతినిధి తెలిపారు. మరో 2-3 గంటల్లో డిశ్చార్జి కానున్నారు. చింతించాల్సిన పనిలేదు. ప్రస్తుత ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ పదవీ కాలం కూడా డిసెంబర్ 10తో ముగియనుంది.ఉర్జిత్ పటేల్ హఠాత్తుగా రాజీనామా చేయడంతో ఆరేళ్ల క్రితం ఆర్‌బీఐ గవర్నర్‌గా శక్తికాంత దాస్ బాధ్యతలు చేపట్టారు. తన పదవీ కాలంలో, కోవిడ్ కారణంగా దేశంలో తలెత్తిన ద్రవ్యోల్బణం సమస్యను నియంత్రించడంలో ఆయన విశేషమైన కృషి చేశారు.

పాటల రచయిత కులశేఖర్ కన్నుమూత

హైదరాబాద్, నవంబర్ 26 (ఋషి ప్రతినిధి): టాలీవుడ్ సినిమా ఇండస్ట్రీలో విషాదం చోటు చేసుకుంది. ప్రముఖ పాటల రచయిత కులశేఖర్ కన్నుమూశారు. గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోన్న ఆయన మంగళవారం తుది శ్వాస విడిచారు. దీంతో పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు, నెటిజన్లు కుల శేఖర్ మృతిపై తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నారు. సుమారు 100 సినిమాలకి పైగా పాటలు రాసి తిరుగులేని రైటర్?గా ఎదిగిన కులశేఖర్.. 15, ఆగస్ట్ 1971న సింహాచలంలో జన్మించారు. స్కూల్లో ఉన్నప్పుడు పాటలు రాసి బహుమతులు అందుకున్నారు కులశేఖర్. తర్వాత జర్నలిస్టుగా కెరీర్ మొదలుపెట్టారు. సాహిత్యం మీద ఆసక్తి ఉండడంతో సిరివెన్నెల సీతారామశాస్త్రి దగ్గర శిష్యరికం చేస్తూ సినీ గీతాల రచనలో మెళకువలు తెలుసుకున్నారు. తర్వాత తేజ దర్శకత్వంలో రామోజీరావు నిర్మించిన 'చిత్రం' సినిమాతో గేయ రచయితగా పరిచయం అయ్యాడు. చిత్రంలో పాటలన్నీ ఆయనే రాశారు. ఆర్.పి.పట్నాయక్, తేజలతో కలిసి అనేక సినిమాలకు పనిచేశారు. చిత్రం, జయం, రామ్మా! చిలకమ్మా, ఘర్షణ, వసంతం, నువ్వు నేను, ఔనన్నా కాదన్నా, మృగరాజు, సుబ్బు వంటి చిత్రాలకు ఆయన సాహిత్యం అందించి గుర్తింపు తెచ్చుకున్నారు.

ఇజ్రాయెల్‌పై 250 హెజ్బొల్లా రాకెట్స్

ఇజ్రాయెల్, గాజా మధ్య బాంబుల మోత

గాజా, నవంబర్26 (ఋషి ప్రతినిధి): ఇజ్రాయెల్, హెజ్బొల్లా మధ్య యుద్ధం తారాస్థాయికి చేరింది. రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఇజ్రాయెల్, గాజా మధ్య బాంబుల మోత మోగుతోంది. తాజాగా హెజ్బొల్లా మిలిటెంట్ సంస్థ ఇజ్రాయెల్‌పై రాకెట్స్ వర్షం కురిపించింది. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 250 రాకెట్స్‌ను ఇజ్రాయెల్‌పైకి ఎక్కుపెట్టింది. హెజ్బొల్లా మిలిటెంట్ సంస్థ చరిత్రలో ఇదొక అతిపెద్ద దాడిగా ఆ సంస్థ ప్రకటించింది. ఇప్పటికే లెబనాన్ భూభాగంలోకి చొచ్చుకుపోయిన ఇజ్రాయెల్.. అక్కడ వరుస దాడులతో హమాస్‌ను కోలుకోలేని దెబ్బ కొట్టింది. హమాస్ అనుబంధ సంస్థ అయిన హెజ్బొల్లాను కూడా అంతమొందించేందుకు ఇజ్రాయెల్ కంకణం కట్టుకున్నట్లు యుద్ధం చేస్తోంది. అందులో భాగంగానే హెజ్బొల్లా మిలిటెంట్స్‌కు గట్టి పట్టున్న దక్షిణ బేరూట్‌పై ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపించింది. ఈ దాడిలో డజన్ల కొద్ది పౌరులు చనిపోయారు. భారీ అంతస్తుల భవనాలు నేలకూలాయి. శిథిలాల కింద చిక్కుకున్న వారి సంఖ్య ఎంతో కూడా కచ్చితంగా చెప్పలేని పరిస్థితి. హెజ్బొల్లాకు స్థావరాలు లేకుండా చేయడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ ఈ దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్ చేసిన ఈ దాడికి హెజ్బొల్లా ప్రతీకారంతో రగిలిపోయింది. ఇక సమయం వృథా చేసి లాభం లేదనే నిర్ణయానికొచ్చిన హెజ్బొల్లా మిలిటెంట్స్... ఈసారి గోడౌన్లోంచి రాకెట్స్ బయటికి తీశారు. ఒకదాని తరువాత మరొకటి అన్నట్లు ఏకకాలంలో ఇజ్రాయెల్‌లోని నాలుగు లక్ష్యాలను టార్గెట్ చేస్తూ 250 రాకెట్స్‌ను ప్రయోగించారు. దక్షిణ ఇజ్రాయెల్‌లోని ఆష్డాదా నేవల్ బేస్ లక్ష్యంగా హెజ్బొల్లా ఈ మిస్సైల్స్ దాడి జరిపింది. వెంటనే టెల్ అవివ్‌లోని మిలిటరీ స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుని అడ్వాన్స్‌డ్ రాకెట్స్ ప్రయోగించింది. అదే సమయంలో నగరానికి మరో వైపున ఉన్న గ్లిలాట్ ఆర్మీ ఇంటెలీజెన్స్ స్థావరంపై కూడా రాకెట్స్ గురిపెట్టింది. హెజ్బొల్లా వైపు నుండి 250 రాకెట్స్ దాడి జరిగినట్లుగా ఇజ్రాయెల్ డిఫెన్స్ వర్గాలు కూడా అంగీకరించాయి. హెజ్బొల్లా చేసిన మిస్సైల్స్ దాడుల్లో ఇదే అతిపెద్ద దాడిగా ఇజ్రాయెల్ రక్షణ శాఖ వర్గాలు పేర్కొన్నాయి. హెజ్బొల్లా ప్రయోగించిన రాకెట్స్‌లో కొన్నింటిని ఇజ్రాయెల్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ విజయవంతంగా తిప్పికొట్టింది. ఇంకొన్ని రాకెట్స్ సెంట్రల్ ఇజ్రాయెల్‌పై పడ్డాయి. ఈ రాకెట్స్ ఎటాక్‌లో కొన్ని ఇళ్లు ధ్వంసమైనట్లుగా అసోసియేటెడ్ ప్రెస్ ప్రెస్ వెల్లడించింది. ఇంకొన్ని రాకెట్స్ ఏకంగా ఇజ్రాయెల్‌కి అతి ముఖ్యమైన టెల్ అవీవ్ నగరం వరకు చేరుకున్నాయని ఆ వార్తా సంస్థ తెలిపింది. ఇక్కడ కూడా రాకెట్స్ దాడిలో కొన్ని భవనాలు శిథిలమైనట్లు తెలుస్తోంది. ఏడుగురు గాయపడినట్లు ఇజ్రాయెల్ డిఫెన్స్ వర్గాలు చెబుతున్నాయి. తాజా దాడులకంటే కొద్ది రోజుల ముందే హెజ్బొల్లా వైపు నుండి ఇజ్రాయెల్‌కు కాల్పుల విరమణకు ఒక ప్రతిపాదన వెళ్లింది. కానీ ఇజ్రాయెల్ అప్పుడు ఆ ప్రతిపాదనను లైట్ తీసుకుంది. అయితే, ఇటీవలే నెదర్లాండ్స్‌లోని ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు అరెస్ట్ వారెంట్ జారీచేసింది. ఇజ్రాయెల్ మాజీ డిఫెన్స్ చీఫ్ గల్లంట్ యోవ్‌కు కూడా ఈ అరెస్ట్ వారెంట్ జారీ అయింది. యుద్ధం పేరుతో లెబనాన్ గడ్డపై బెంజమిన్ నెతన్యాహు, గల్లంట్ సాగించిన మారణకాండను ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు తప్పుపట్టింది. ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు చేసిన ఈ వ్యాఖ్యలతో ప్రపంచ దేశాల ముందు నెతన్యాహు ఒక దోషిలా నిలబడాల్సి వచ్చింది. హెజ్బొల్లా ప్రయోగించిన 250 రాకెట్స్ దాడి తరువాత తాజాగా ఇజ్రాయెల్ ప్రధాని కాల్పుల విరమణ ఒప్పందానికి సూత్ర ప్రాయంగా అంగీకరించినట్లు సీఎన్ఎన్ తెలిపింది. అయితే, ఈ కాల్పుల విరమణకు కొన్ని షరతులు విధించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఇప్పటికే ఇజ్రాయెల్ తమ ఆధీనంలోకి తీసుకున్న భూభాగాన్ని తిరిగి ఇచ్చేందుకు బెంజమిన్ నో చెప్పినట్లు తెలుస్తోంది.

29న సీడబ్ల్యూసీ సమావేశం

ఘోర ఓటమిపై అంతర్మథనం

ఓటమి కారణాలపై చర్చ

అగ్రనేతలంతా పాల్గొనే అవకాశం

ముంబై, నవంబర్ 26 (ఋషి ప్రతినిధి): మహారాష్ట్రలో కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయాలను మూటగట్టుకున్న నేపథ్యంలో ఆ పార్టీ వర్కింగ్ కమిటీ సమావేశం కాబోతోంది. ఈ నెల 29న సీడబ్ల్యూసీ సమావేశం నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలోని అగ్ర నేతలందరూ ఈ సమావేశంలో పాల్గొంటారు. మహారాష్ట్ర, హర్యానాల్లో గెలిచేందుకు మంచి అవకాశాలున్నా కాంగ్రెస్ పార్టీ ఓటమి పాలవడగానికి కారణాలు ఏమిటి..? లోపాలు ఎక్కడున్నాయి..? అనే అంశాలు సీడబ్ల్యూ సమావేశంలో చర్చకు రానున్నాయి. అదేవిధంగా దేశంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై కూడా సమావేశంలో చర్చించనున్నారు. కాగా, ఈ మధ్య కాలంలో జరిగిన హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో, ఇటీవల జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పరాజయాలను చవిచూసింది. ఆ రెండు రాష్ట్రాల్లోనూ గెలుపు తమదేనన్న ధీమాతో కాంగ్రెస్ పార్టీ ఉంది. కానీ ఫలితాలు భిన్నంగా వచ్చాయి. హర్యానాలో పూర్తిగా అధికార బీజేపీకి వ్యతిరేక పవనాలు వీచినా.. ఆ పరిస్థితిని కాంగ్రెస్ పార్టీ తనకు అనుకూలంగా మార్చుకోలేకపోయింది. మహారాష్ట్రలో కూడా మహాయుతి కూటమిపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చింది. కానీ ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ కూటమి దాన్ని తనకు అనుకూలంగా మలచుకోవడంలో విఫలమైంది.

కేరళలో ఘోర రోడ్డు ప్రమాదం

రోడ్డు పక్కన గుడారాలను ఢీకొట్టిన ట్రక్కు

ఇద్దరు చిన్నారులు సహా ఐదుగురు మృతి

త్రిసూర్, నవంబర్ 26 (ఋషి ప్రతినిధి): కేరళలోని త్రిసూర్ జిల్లాలో మంగళవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వల్పాడ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై రోడ్డు పక్కన నివసిస్తున్న సంచార జాతుల గుడారాలను వేగంగా వచ్చిన ట్రక్కు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు చిన్నారులు సహా ఐదుగురు మృతి చెందారు. లారీ ఢీకొన్న ఘటనలో గాయపడిన వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. తెల్లవారుజామున 4:30 గంటల ప్రాంతంలో గాఢ నిద్రలో ఉన్న సమయంలో ఈ ఘటన జరిగింది. ఘటనపై సమాచారం ఇస్తూ, గాయపడిన ఐదుగురిని త్రిసూర్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రిలో చేర్చామని, వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. మృతుల్లో ఇద్దరు మహిళలు, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. పిల్లల్లో ఒకరికి ఏడాదిన్నర కాగా మరొకరికి నాలుగేళ్లు. మృతులంతా తమిళనాడు వాసులుగా గుర్తించారు. ఈ ఘటనకు కారణమైన లారీ డ్రైవర్, క్లీనర్‌లను అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు.

ఛత్తీస్‌గఢ్‌లో పట్టాలు తప్పిన 20 బోగీలు

రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం..!

బిలాస్‌పూర్, నవంబర్ 26 (ఋషి ప్రతినిధి): ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్ రైల్వే డివిజన్ పరిధిలో ఓ రైలు 20 బోగీలు పట్టాలు తప్పింది. బొగ్గు లోడ్‌తో వెళ్తున్న గూడ్స్ రైలు బిలాస్‌పూర్ నుంచి కట్నీకి వెళ్తోంది. ఈ క్రమంలో ఖోంగ్‌సార్ మధ్య రైలు పట్టాలు తప్పింది. ఏకంగా రైలులోని 20 బోగీలు పట్టాలు తప్పాయి. సమాచారం అందుకున్న రైల్వే అధికారులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ట్రాక్‌ను క్లియర్ చేసి రైళ్ల రాకపోకలను పునరుద్ధరించే పనులు మొదలు పెట్టారు. మంగళవారం ఉదయం బొగ్గుతో కూడిన గూడ్స్ రైలుకు చెందిన 20 వ్యాగన్లు పట్టాలు తప్పడంతో ప్యాసింజర్ రైళ్ల రాకపోకలపై ప్రభావం పడిందని రైల్వే అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం జరగనప్పటికీ, బిలాస్‌పూర్-కట్నీ సెక్షన్‌లో అప్ అండ్ డౌన్ లైన్లలో రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగిందని వారు తెలిపారు. రైలు పట్టాలు తప్పడానికి గల ఖచ్చితమైన కారణాలు విచారణ తర్వాత తెలుస్తాయని అధికారులు తెలిపారు. ఈ ఘటనతో ఆ మార్గంలో నడిచే పూరీ యోగ్నాగ్రి రిషికేష్ ఉత్కల్ ఎక్స్‌ప్రెస్, దుర్గ్ %-% ఎంసీటీఎమ్ (ఉధంపూర్) ఎక్స్‌ప్రెస్ సహా పలు ప్యాసింజర్ రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆయా రైళ్లను దారి మళ్లించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

పాకిస్థాన్‌లో హింసాత్మకంగా నిరసనలు

ఆరుగురు భద్రతా సిబ్బంది మృతి

ఆర్మీకి షూట్ ఎట్ సైట్ ఆర్డర్స్

ఇస్లామాబాద్, నవంబర్26 (ఋషి ప్రతినిధి): పాకిస్థాన్ మాజీ ప్రధాని, తెహ్రీక్ -ఏ- ఇన్సాఫ్ (పీటీఐ) అధినేత ఇమ్రాన్ ఖాన్‌ను జైలు నుంచి విడుదల చేయాలంటూ ఆ పార్టీ మద్దతుదారులు చేపట్టిన భారీ నిరసన హింసాత్మకంగా మారింది. ఈ ఘటనలో నలుగురు పారామిలిటరీ సిబ్బంది, ఇద్దరు పోలీసులు మృతి చెందారు. దాదాపు 100మంది సెక్యూరిటీ సిబ్బంది గాయపడ్డారు. నిరసనలు హింసాత్మకంగా మారడం వల్ల, రాజధాని ఇస్లామాబాద్ ప్రాంతంలో ప్రభుత్వం భద్రతా చర్యలు కట్టుదిట్టం చేసింది. కనిపిస్తే కాల్చేయమని ఆర్మీకి ఆదేశాలు జారీ చేసింది. దీంతో ముందు జాగ్రత్తగా రాజధాని ఇస్లామాబాద్‌లోని విద్యాసంస్థలకు మంగళవారం సెలవు ప్రకటించారు.మంగళవారం కూడా పీటీఐ మద్దతుదారుల నిరసనలు కొనసాగుతున్నాయి. ఇస్లామాబాద్, రావల్పిండికి వెళ్లే ప్రధాన రహదారులను మూసివేసిన ప్రభుత్వం, పెద్దఎత్తున భద్రతబలగాలను మోహరించింది. ఆయా నగరాలకు వెళ్లే రైళ్లు, మెట్రో బస్సుల సర్వీసులను కూడా నిలిపివేసింది. ఇస్లామాబాద్‌లోకి ప్రవేశించకుండా అడ్డుకున్న పోలీసులపై ఆందోళనకారులు దాడి చేశారు. ఈ ఘనటలో ఐదుగురు భద్రతాసిబ్బంది మృతి చెందారు. మరోవైపు పంజాబ్ ప్రావిన్స్‌లో ఒక పోలీసు అధికారి మరణించగా, మరో 119మంది తీవ్రంగా గాయపడ్డారని పోలీసులు తెలిపారు. 22 పోలీసు వాహనాలకు నిప్పంటించారని చెప్పారు. ఆందోళనకారుల్లో నలుగురు మృతి చెందినట్లు ప్రకటించారు. ఇమ్రాన్ భార్య బుష్రాబీబీ నేతృత్వంలో ఆదివారం మొదలైన నిరసన ప్రదర్శన ఇస్లామాబాద్ చేరింది. ఇమ్రాన్ జైలు నుంచి విడుదలయ్యాకే తాము ఇంటికి వెళ్తామంటూ ఆయన భార్య బుష్రాబీబీ పేర్కొనటం వల్ల పీటీఐ శ్రేణులు బ్యారీకేడ్లను దాటుకొని ఇస్లామాబాద్‌లోకి ప్రవేశించారు. ఆందోళనకారులను అడ్డుకున్న పోలీసులపై హింసాత్మక దాడులకు పాల్పడుతున్నారు. దీంతో ఆందోళనకారులపై పోలీసులు లాఠీఛార్జీ చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే భద్రతా సమస్యలు ఉన్న ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలను ప్రభుత్వం నిలిపివేసింది. అయితే ఇది ఎంతకాలం ఉంటుందని స్పష్టం చేయలేదు. పీటీఐ అధినేత ఇమ్రాన్‌ఖాన్ 150కి పైగా క్రిమినల్ కేసుల్లో జైళ్లో ఉన్నారు.

జీడిమెట్ల పారిశ్రామిక వాడలో

భారీ అగ్నిప్రమాదం..

ప్లాస్టిక్ బ్యాగుల తయారీ

పరిశ్రమలో పెద్ద ఎత్తున మంటలు

హైదరాబాద్, నవంబర్ 26 (ఋషి ప్రతినిధి-భాగ్యనగర్): జీడిమెట్ల పారిశ్రామి వాడలో మంగళవారం మధ్యాహ్నం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ప్లాస్టిక్ బ్యాగుల తయారీ పరిశ్రమలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా ప్రాంతానికి చేరుకుని మంటలు ఆర్పుతున్నారు. నాలుగు ఫైరింజన్‌లు, ఆరు వాటర్ ట్యాంకర్‌ల సాయంతో మంటలు ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు. మధ్యాహ్నం నుంచి ఆరు గంటలుగా మంటలను అదుపులోకి తెచ్చేందుకు ఫైర్ సిబ్బంది ప్రయత్నిస్తున్నా ఇప్పటికి మంటలు అదుపు కాలేదు. ఘటనా స్థలంలో పరిస్థితిని జీడిమెట్ల సీఐ, బాలనగర్ ఏసీపీ పర్యవేక్షిస్తున్నారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం లేదని పోలీసులు తెలిపారు. అయితే భారీగా ఆస్తి నష్టం వాటిల్లిందని చెప్పారు. ప్రమాదానికిగల కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

4న పెద్దపల్లిలో సీఎం విజయోత్సవ సభ

9 వేల మందికి నియామక పత్రాలు

హైదరాబాద్, నవంబర్ 26 (ఋషి ప్రతినిధి): కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్న సందర్భంగా డిసెంబర్ 4న పెద్దపల్లిలో నిరుద్యోగ యువతతో విజయోత్సవ సభ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సభకు సీఎం రేవంత్ రెడ్డి హాజరై గ్రూప్ 4 తో పాటు వివిధ పరీక్షల్లో రిక్రూటైన 9 వేల మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయనున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడుస్తుండటంతో పెద్దపల్లిలో నిరుద్యోగ యువతతో విజయోత్సవ సభ నిర్వహించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. అందుకు పెద్దపల్లి జిల్లా అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి 4న పెద్దపల్లి జిల్లాలో పర్యటిస్తారు. ఆ రోజు నిరుద్యోగ యువతతో భారీ బహిరంగ సభ నిర్వహించి ఇటీవల వివిధ పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చి ఉద్యోగాలకు ఎంపికైన 9 వేల మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయనున్నారు. అందుకు భారీ బహిరంగ సభకు అనువైన స్థలాన్ని అధికారులు పరిశీలించారు. పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష జిల్లా అధికారులతో కలిసి పెద్దకల్వల లోని సమీకృత జిల్లా కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలాన్ని, పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానాన్ని పరిశీలించారు. సభా స్థలాన్ని పరిశీలించి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డిసెంబర్ 4న పెద్దపెల్లి జిల్లాలో నిరుద్యోగ యువతతో విజయో త్సవ సభ జరుపుతుందని తెలిపారు. నిరుద్యోగ విజయోత్సవ సభకు రేవంత్ హాజరై గ్రూప్ 4, ఇతర వివిధ పోటీ పరీక్షలకు కింద ఎంపికైన 9 వేల మది అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. సీఎం టూర్ ప్రజా పాలన విజయోత్సవ సభ సందర్భంగా ఉన్నతాధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచిం చారు. సభ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ పెద్ద కల్వలలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు చేసిన ధాన్యం తరలింపు వెంటనే జరిగేలా చూడాలని ఆదేశించారు. నాణ్యమైన ధాన్యాన్ని త్వరగా కాంటా వేసి కొనుగోలు చేయాలని సూచించారు.

27కు రాంగోపాల్ వర్మ విచారణ వాయిదా

ప్రముఖ టాలీవుడ్ డైరెక్టర్ రాంగోపాల్ వర్మ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. ఈనెల 27కు ఏపీ హైకోర్టు విచారణను వాయిదా వేసింది. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్‌పై ఫొటోలు మార్ఫింగ్ చేసి ఎక్స్‌లో పోస్ట్ చేసిన వ్యవహారంలో రాంగోపాల్ వర్మపై ఒంగోలు, విశాఖ, గుంటూరు జిల్లాలో కేసులు నమోదయ్యాయి. ప్రకాశం జిల్లా మద్దిపాడు పీఎస్‌లో కేసులో పోలీసులు రెండు సార్లు నోటీసులు అందించినా వర్మ విచారణకు హాజరుకాలేదు. దీంతో వర్మ కోసం పోలీసులు హైదరాబాద్, తమిళనాడులో గాలింపు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో హైకోర్టులో ఆర్జీవీ ముందస్తు బెయిల్ కోరుతూ పిటిషన్ వేశారు. ఆర్జీవీ పిటిషన్‌పై మంగళవారం విచారణ జరుగగా విచారణ రేపటికి వాయిదా పడింది. ఈ నెల 23న కోయంబత్తూరులో షూటింగ్‌లో పాల్గొన్నట్టు తెలియజేస్తూ.. యాక్టర్లతో దిగిన ఫొటోలను ఎక్స్‌లో ట్వీట్ చేశాడు వర్మ. ఈ నేపథ్యంలో ఏపీ పోలీసులు రాంగోపాల్ వర్మ కోసం కోయంబత్తూరు వెళ్లినట్టు సమాచారం. ఈ కేసులో ఇప్పటికే వర్చువల్‌గా విచారణకు హాజరవుతారని వర్మ లీగల్ టీం పోలీసులకు తెలియజేసిన విషయం తెలిసిందే. ఒంగోలు పోలీసులు మొదట హైదరాబాద్‌లోని ఆర్జీవీ ఇంటికి కూడా వెళ్లారు. అయితే వర్మ అక్కడ లేకపోవడంతో పోలీసులు గాలింపు ముమ్మరం చేశారని తెలిసిందే. వర్మ ఫోన్ స్విచాఫ్ వస్తున్నట్టు కూడా వార్తలు వచ్చాయి.

ఆయన నాకు తండ్రిలాంటి వారు : మోహిని

ప్రముఖ సంగీత దర్శకుడు, ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ తన భార్య సైరా భానుతో విడిపోతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఇక రెహమాన్ దంపతులు విడాకులు ప్రకటించిన గంటల వ్యవధిలోనే రెహమాన్ మ్యూజిక్ బృందంలోని బాసిస్ట్ మోహినీ దే కూడా తన భర్తతో విడాకులు ప్రకటించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ ఇద్దరి మధ్య సంబంధం ఉందని అందుకే విడాకులు తీసుకోబోతున్నారని వార్తలు వచ్చాయి. దీనిపై మోహిని మరోసారి స్పందించారు. రెహమాన్ తనకు తండ్రిలాంటి వారని చెప్పుకొచ్చారు. తనది, రెహమాన్ కుమార్తెలది ఒకే వయసు అని.. ఆయనెప్పుడూ తనని కుమార్తెలానే చూసేవారని తెలిపింది. ఎనిమిదేళ్లుగా ఆయన బృందంలో పనిచేస్తున్నట్లు తెలిపింది. రెహమాన్ అంటే తనకు ఎంతో గౌరవం ఉందని స్పష్టం చేసింది. ఆయన తనకు తండ్రితో సమానమని స్పష్టం చేసింది. తన కెరీర్‌లో ఆయన కీలక పాత్ర పోషించారని వివరించింది. అలాంటి తమపై ఇలాంటి వార్తలు రావడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేసింది. ఇలాంటి సున్నితమైన అంశాల్లో సానుభూతి లేకుండా నిందలు వేయడం సరికాదని పేర్కొంది. ఇక్కడితో ఈ రూమర్స్‌కు ఫుల్‌స్టాప్ పెట్టి.. తమ గోప్యతను గౌరవించాలని కోరింది. ఈ మేరకు ఓ వీడియో విడుదల చేసింది. ఏఆర్ రెహమాన్ 1995లో సైరా భానును వివాహం చేసుకున్నారు. ఇద్దరి మధ్య ఏర్పడిన మనస్పర్థల కారణంగా ఈ జంట విడిపోతున్నట్లు ఇటీవలే ప్రకటించారు. 29 ఏళ్ల వైవాహిక జీవితానికి ఇద్దరూ పరస్పర అంగీకారంతో ముగింపు పలికారు. ఇక ఈ దంపతులకు ఖతీజా, రహీమా, అమీన్ అనే ముగ్గురు పిల్లలు ఉన్నారు. ముగ్గురు పిల్లలకు పెళ్లయ్యింది. వైవాహిక బంధంలో ఏర్పడిన భావోద్వేగ క్షణం తర్వాత ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు ఏఆర్ రెహమాన్ న్యాయవాది తెలిపారు. ఒకరిపై ఒకరికి అమితమైన ప్రేమ ఉన్నా.. ఉద్రిక్తలు, ఆందోళనలు వారి మధ్య గ్యాప్‌ను పెంచాయని.. ఆ అగాధాన్ని పూడ్చేందుకు ఎవరు కూడా సిద్ధంగా లేరన్నారు.



భయపెట్టేందుకు వస్తున్న వేదిక

బాణం, రూలర్, శివలింగ, కాంచన 3 సినిమాలతో టాలీవుడ్‌లో మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది వేదిక. ఈ ముద్దుగుమ్మ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ ప్రాజెక్టులతో బిజీగా ఉండగా.. వీటిలో ఒకటి ఫియర్. ఈ సినిమాకు లక్కీ లక్ష్మణ్ నిర్మాత హరిత గోగినేని కథనందిస్తూ దర్శకత్వం వహిస్తోంది. ఇప్పటికే ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేయగా.. చీకట్లో ముఖంపై చేతులు పెట్టుకొని భయంగా కనిపిస్తున్న లుక్ ఇప్పటికే సినిమాపై అంచనాలు పెంచుతోంది. కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. భయంకరమైన ప్రపంచంలోకి అడుగు పెట్టడానికి ధైర్యంగా మిమ్మల్ని మీరుసిద్ధం చేసుకోండి. వాస్తవ ఘటనల ఆధారంగా వస్తోన్న ఈ చిత్రం డిసెంబర్ 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుందని తెలియజేస్తూ కొత్త లుక్ విడుదల చేశారు. ఈ పోస్టర్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ మూవీని దత్తాత్రేయ మీడియా బ్యానర్‌పై ఏఆర్ అభి నిర్మిస్తుండగా.. సుజాత రెడ్డి సహనిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి అనూప్ రూబెన్స్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తుండగా.. ఆండ్రీవ్ బాబు సినిమాటోగ్రఫర్‌గా పనిచేస్తున్నాడు.

అన్‌స్టాపబుల్ విత్ ఎన్‌బీకేలో శ్రీలీల

టాలీవుడ్ యాక్టర్ బాలకృష్ణ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న టాక్ షో అన్‌స్టాపబుల్ విత్ ఎన్‌బీకే. బాలకృష్ణ సీజన్ 4లో ఎంటర్‌టైన్ మెంట్ డోస్ పెంచుతూ కొత్త కొత్త సెలబ్రిటీలతో సందడి చేస్తున్నారు. ఇటీవలే పుష్ప 2 ది రూల్ ప్రమోషన్స్‌లో భాగంగా పాన్ ఇండియా స్టార్ అల్లు అర్జున్ అన్‌స్టాపబుల్ విత్ ఎన్‌బీకేలో బాలకృష్ణతో సందడి చేశాడని తెలిసిందే. ఈ ఎపిసోడ్ కూడా నెట్టింట వైరల్ అవుతోంది. భగవంత్ కేసరిలో బాలకృష్ణతో కలిసి నటించిన విషయం తెలిసిందే. ఈ ఇద్దరి కాంబోకు మంచి ప్రశంసలు దక్కాయి. తాజాగా బాలయ్య, శ్రీలీల మరోసారి సందడి చేయబోతున్నారన్న వార్త ఇండస్ట్రీ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. తాజాగా మరో అతిథిగా డ్యాన్సింగ్ క్వీన్ శ్రీలీలను ఫైనల్ చేశారు మేకర్స్. శ్రీలీల అన్‌స్టాపబుల్ తాజా ఎపిసోడ్ షూట్‌లో జాయిన్ అయింది. స్లీవ్ లెస్ టాప్, చీరకట్టులో క్యారవాన్ ముందు హొయలు పోతున్న స్టిల్స్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇంతకీ శ్రీలీల ఎపిసోడ్ ప్రోమో ఎప్పుడొస్తుందనేది తెలియాల్సి ఉంది. అన్‌స్టాపబుల్ షోలో శ్రీలీల తర్వాత రాబోయే గెస్ట్ నవీన్ పొలిశెట్టి అని ఫిలింనగర్ సర్కిల్ టాక్.

నాగచైతన్యతో విడాకుల గురించి సమంత తాజాగా మరోసారి స్పందించారు. డివోర్స్ తర్వాత తనపై చాలా రూమర్స్ వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఎన్నో ట్రోలింగ్స్‌ను ఎదుర్కొన్నట్లు చెప్పుకొచ్చారు. కొందరు తనను 'సెకండ్ హ్యాండ్' అని కామెంట్ చేశారని తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సమంత మాట్లాడుతూ.. 'విడాకులు తీసుకుంటే దాన్ని జనం ఫెయిల్యూర్‌గా పరిగణిస్తారు. ఇలాంటి పరిస్థితులు ఎదుర్కోవడం చాలా కష్టంగా ఉంటుంది. పెళ్లైన నాలుగేళ్లకే చైతన్యతో విడాకులు తీసుకున్న తర్వాత నేను ఎన్నో తీవ్రమైన ట్రోలింగ్స్‌ను ఎదుర్కొన్నా. నన్ను కొందరు 'సెకండ్ హ్యాండ్' అని కామెంట్ చేశారు. నాపై చాలా రూమర్స్ వచ్చాయి. ఎన్నో అబద్ధాలు వ్యాప్తి చెందాయి. అవన్నీ నిజం కాదని చాలా సార్లు బయటకు వచ్చి చెప్పాలని అనిపించింది. కానీ చెప్పడం వల్ల ప్రయోజనం ఏమీ ఉండదని ఆగిపోయాను' అంటూ సామ్ చెప్పుకొచ్చింది.

నన్ను సెకండ్ హ్యాండ్ అన్నారు

సినీ నటుడు శ్రీతేజ్‌పై కేసు నమోదు

ప్రముఖ సినీ నటుడు శ్రీతేజ్‌పై కూకట్‌పల్లి పీఎస్‌లో కేసు నమోదైంది. తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని శ్రీతేజ్‌పై ఓ యువతి ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో శ్రీతేజ్‌పై బీఎన్ఎన్ 69, 115 (2), 318 (2) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. శ్రీతేజ్‌పై గతంలో కూడా ఇదే పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. శ్రీతేజ్ పెళ్లైయిన మరో వివాహితతో అక్రమ సంబంధం పెట్టుకుంటున్నట్టు ఆరోపణలున్నాయి. అక్రమ సంబంధం విషయం తెలిసి గుండెపోటుతో అప్పట్లో బ్యాంక్ ఉద్యోగి సురేశ్ మృతి చెందాడు. బ్యాంక్ ఉద్యోగి మృతితో గతంలో మాదాపూర్ పీఎస్‌లో కేసు నమోదైంది. వంగవీటి, లక్ష్మీస్ ఎన్టీఆర్, పుష్ప ది రైజ్, మంగళవారం, ధమాకా సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న శ్రీతేజ్ ప్రస్తుతం పుష్ప ది రూల్‌లో కీలక పాత్రలో నటిస్తున్నాడు.

ప్రముఖ సినీ గేయ రచయిత కులశేఖర్ కన్నుమూత

తెలుగు సినీ ఇండస్ట్రీలో విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ సినీ గేయ రచయిత కులశేఖర్ (54) కన్నుమూశారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతూ హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో మంగళవారం ఉదయం కన్నుమూశారు. చిత్రం, నువ్వు-నేను, మనసంతా నువ్వే, ఔనన్నా కాదన్నా, ఘర్షణ, భద్ర, సంతోషం, జయం, సైనికుడు లాంటి సూపర్‌హిట్ చిత్రాలకు పాటల రచయితగా పనిచేశారు కులశేఖర్. అయితే వందకు పైగా సినిమాలకు స్టార్ రైటర్‌గా పనిచేసిన కుల శేఖర్ చెడు వ్యసనాలకు బానిసై కొన్నేళ్లుగా చిత్ర పరిశ్రమకు దూరమయ్యాడు. కుటుంబ సభ్యులతోనూ కూడా దూరంగా ఉన్నాడు. కొన్ని సంవత్సరాల కిందటా ఒక దొంగతనం కేసులో కూడా అరెస్ట్ అయ్యి ఆరు నెలలు జైలులో ఉండి బయటికి వచ్చాడు. ఇక బయటికి వచ్చిన అనంతరం గేయ రచయితగా తన కెరీర్ నాశనం అవ్వడంతో మానసికంగా చాలా కుంగిపోయారు. దీంతో అతడికి అనారోగ్య సమస్యలు రాగా.. చివరికి దయనీయ స్థితిలో మృత్యు ఒడికి చేరారు. ఇక కులశేఖర్ మరణవార్త తెలుసుకున్న సినీ ప్రముఖులు ఆయనకు సంతాపం తెలియచేస్తున్నారు.

రెండో టెస్టుకి పింక్ బాల్

భారత్ – ఆస్ట్రేలియా మధ్య జరిగిన బోర్డర్–గవాస్కర్ టెస్టు సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్‌లో టీమిండియా విజయం సాధించింది. పెర్త్‌లోని ఆప్టస్ స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో భారత జట్టు 295 పరుగుల తేడాతో ఆసీస్‌ను ఓడించి శుభారంభం చేసింది. ఇప్పుడు రెండో టెస్టు మ్యాచ్‌కి ఇరు జట్లు సిద్ధమవుతున్నాయి. బోర్డర్–గవాస్కర్ సిరీస్‌లో రెండో టెస్టు మ్యాచ్ డిసెంబర్ 6 నుంచి ప్రారంభం కానుంది. అడిలైడ్ వేదికగా జరగనున్న ఈ మ్యాచ్ పింక్ బాల్ టెస్ట్. అంటే, ఈ టెస్ట్ మ్యాచ్ డే/నైట్ జరగనుంది. అందుకే ఈ మ్యాచ్‌లో రెడ్ బాల్‌కు బదులు పింక్ బాల్‌ను వినియోగిస్తున్నారు.దీని ప్రకారం డిసెంబర్ 6 నుంచి అడిలైడ్‌లోని ఓవల్ మైదానంలో పింక్ బాల్ టెస్టు మ్యాచ్ జరగనుండగా, ఈ మ్యాచ్‌లో టీమిండియాకు రోహిత్ శర్మ నాయకత్వం వహించనున్నాడు. పెర్త్‌లో జరిగిన తొలి టెస్టుకు హిట్‌మ్యాన్ అందుబాటులో లేడు. వ్యక్తిగత కారణాలతో రోహిత్ శర్మ తొలి టెస్టుకు దూరమయ్యాడు. జస్ప్రీత్ బుమ్రా తన గైర్హాజరీలో టీమ్ ఇండియాను విజయవంతంగా నడిపించాడు. ఇప్పుడు రోహిత్ శర్మ జట్టులోకి రావడంతో కెప్టెన్ స్థానంతో ప్లేయింగ్ ఎలెవన్‌లో కనిపించనున్నాడు. హిట్ మ్యాన్ రాకతో తొలి మ్యాచ్ ఆడిన దేవదత్ పడిక్కల్ ఔట్ తప్పుకోనున్నాడు.భారత టెస్టు జట్టు: రోహిత్ శర్మ (కెప్టెన్), జస్ప్రీత్ బుమ్రా (వైస్ కెప్టెన్), యస్సువి జైస్వాల్, అభిమన్యు ఈశ్వరన్, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్, రిషబ్ పంత్ (వికెట్ కీపర్), సర్ఫరాజ్ ఖాన్, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, మహ్మద్ సిరాజ్ , ఆకాష్ దీప్, పర్దీష్ కృష్ణ, హర్షిత్ రాణా, నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, దేవదత్ పడిక్కల్.

ఆస్ట్రేలియా టెస్ట్ జట్టు

పాట్ కమిన్స్ (కెప్టెన్), ట్రావిస్ హెడ్, ఉస్మాన్ ఖవాజా, నాథన్ మెక్‌స్వీనీ, స్టీవ్ స్మిత్, మార్నస్ లాబుస్‌చాగ్నే, మిచెల్ మార్ష్, అలెక్స్ కారీ, జోష్ ఇంగ్లిస్, మిచెల్ స్టార్క్, జోష్ హేజిల్‌వుడ్, నాథన్ లియాన్, స్కాట్ బోలాండ్.

అరవీర భయంకరంగా ముంబై తుదిజట్టు!

ఐపీఎల్ మెగా వేలం ముగిసింది. జెడ్డా వేదికగా ఆది, సోమవారాల్లో జరిగిన ఈ మెగా ఆక్షన్ అంచనాలకు మించి సాగింది. మొత్తంగా 182 మంది ఆటగాళ్లను కొనుగోలు చేసిన 10 ఫ్రాంచైజీలు ఇందుకు రూ.639.15 కోట్లు ఖర్చుపెట్టాయి. ఇందులో 62 మంది విదేశీ ఆటగాళ్లున్నారు. అయితే గత సీజన్‌లోనూ పాయింట్ల పట్టికలో అట్టుడుగున నిలిచిన, అయిదు సార్లు ఛాంపియన్ అయిన ముంబై ఇండియన్స్ వేలంలో వ్యూహాత్మకంగా వ్యవహరించింది. ఎనిమిది మంది విదేశీ ఆటగాళ్లతో సహా 23 మంది నాణ్యమైన ప్లేయర్లతో ముంబై ఇండియన్స్ తమ జట్టును నిర్మించుకుంది. ఈ మెగావేలంలో తమ బ్యాటింగ్–బౌలింగ్‌ను అత్యంత పటిష్టంగా చేసుకుంది. తమ పేస్ దళాన్ని చూస్తే ఏ ప్రత్యర్థి జట్టు అయినా వణికిపోయేలా సిద్ధం చేసింది. రిటైన్ లిస్ట్‌లో ఇప్పటికే గేమ్ ఛేంజర్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఉన్నాడు. బుమ్రాతో పాటు బంతి పంచుకోవడానికి ట్రెంట్ బౌల్ట్, దీపక్ చాహర్‌ను ముంబై ఇండియన్స్ తీసుకుంది. ఈ పేస్ త్రయాన్ని ఎదుర్కోవడం ఏ ప్రత్యర్థి జట్టుకు అయినా అత్యంత కఠిన సవాలే. రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యకు తోడుగా విల్ జాక్స్ జట్టులో చేరాడు. దీంతో ముంబై ఇండియన్స్ టాప్–5 బ్యాటింగ్ ఆర్డర్ అరవీర భయంకరంగా మారింది. ఈ వేలంలో ముంబై స్పిన్ బలాన్ని కూడా పెంచుకుంది. కర్ణ్ శర్మ, అఫ్గానిస్థాన్ మిస్టరీ స్పిన్నర్ అల్లా గజన్‌ఫర్, న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ మిచెల్ శాంట్నర్‌ను జట్టులోకి తెచ్చుకుంది. అయితే ముంబై ఇండియన్స్ ఓ అంశం కలవరపెడుతోంది. ఇషాన్ కిషన్ స్థానాన్ని భర్తీ చేసే సమర్థవంతమైన వికెట్ కీపర్‌ను వేలంలో సొంతం చేసుకోలేకపోయింది. రాబిన్ మింజ్, ర్యాన్ రికెల్టన్, కృష్ణన్ శ్రీజిత్‌లను సొంతం చేసుకున్నప్పటికీ ఇషాన్ తరహాలో జట్టుకు మద్దతు ఇస్తారా అనేది ప్రశ్న.

ముంబై ఇండియన్స్ ప్లేయింగ్ 11 (అంచనా): రోహిత్ శర్మ, విల్ జాక్స్, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్య, నమన్ ధిర్, రాబిన్ మింజ్, దీపక్ చాహర్, మిచెల్ శాంట్నర్, జస్‌ప్రీత్ బుమ్రా, ట్రెంట్ బౌల్ట్, అల్లా గజన్‌ఫర్.

పంత్‌కు దక్కేది 18.9 కోట్లే

ఐపీఎల్ మెగా వేలంలో రిషబ్ పంత్ అత్యధిక ధర పలికిన సంగతి తెలిసిందే. లక్నో పంత్‌ను రూ.27 కోట్లకు కొనుగోలు చేసింది. అయితే ఈ వార్త తెలిసిన దగ్గరి నుంచి చాలా మందికి ఓ సందేహం వచ్చింది ఉంటుంది. రిషబ్ పంత్‌కు రూ.27కోట్లు ఆన్ హ్యాండ్ వస్తుందా అని అందరీ డౌట్ కచ్చితంగా వచ్చే ఉంటుంది. వాస్తవానికి పంత్ చేతికి రూ.27 కోట్లు రాదు.. రూ.27 కోట్లలో రూ.8.1 కోట్లు పన్నులకు పోగా పంత్ చేతికి రూ. 18.9 కోట్లు మాత్రమే అందుతాయి. అయితే పంత్ టోర్నీకి ముందు గాయపడితే డబ్బు రాదు. అలాగే వ్యక్తిగత కారణాలతో ఐపీఎల్ నుంచి తప్పుకున్నా కూడా డబ్బు ఇవ్వరు. టోర్నీ మధ్యలో గాయపడి మిగితా మ్యాచ్లకు దూరమైతే మాత్రం డబ్బు చెల్లిస్తారు. ఇక భారత్ మ్యాచ్‌లకు ఆడుతూ గాయపడితే డబ్బు చెల్లిస్తారు. ఇది

ఇలా ఉంటే తాజాగా రిషబ్ పంత్ ఇన్‌స్టాగ్రామ్‌లో హృదయపూర్వక పోస్ట్‌తో ఢిల్లీ ఫ్రాంచైజీకి వీడ్కోలు పలికాడు. పంత్ ఢిల్లీ ఫ్రాంచైజీతో తన 9 సంవత్సరాల ప్రయాణం గురించి గుర్తుచేసుకున్నాడు. లక్నో సూపర్ జెయింట్స్‌లో చేరడానికి ముందు అభిమానులకు వీడ్కోలు చెప్పాడు. ఢిల్లీ క్యాపిటల్స్ రూ. 20.75 కోట్లతో అధిగమించిన తర్వాత, పంత్ లక్నోకు చెందిన రూ. 27 కోట్ల రికార్డు రుసుముతో జట్టులో చేరాడు. మెగా–వేలంలో ఈ వికెట్ కీపర్ కోసం సన్‌రైజర్స్ హైదరాబాద్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ఎల్ఎస్‌జీ, డీసీలు పోటిపడ్డాయి. పంత్‌ను రూ. 11 కోట్లతో వదులుకోగా, ఎల్ఎస్‌జీ, ఎస్ఆర్‌హెచ్ రూ. 20.50 కోట్ల వరకు బిడ్డింగ్ వార్ సాగాయి.ఆ తర్వాత ఎస్ఆర్‌హెచ్ డ్రాప్ అవుట్ అయింది. ఢిల్లీ చివరి నిమిషంలో తమ రైట్ టు మ్యాచ్‌ని వినియోగించుకునేందుకు ప్రయత్నించింది. చివరికి రికార్డు వేలం రూ. 27 కోట్లతో పంత్‌ను కొనుగోలు చేసింది. మెగా వేలానికి ముందు కేఎల్ రాహుల్‌ను వదులుకున్న లక్నో జట్టుకు రిషబ్ పంత్ కెప్టెన్‌గా ఉంటాడని అందరూ భావిస్తున్నారు. గత సీజన్‌లో టాప్ ఆర్డరే విఫలమవ్వడంతో తర్వాత వచ్చే బ్యాట్సమెన్లు కూడా చేతులెత్తేస్తున్నారు. దీంతో పంత్‌పైనే ఎల్ఎస్‌సీ భారీ అంచనాలు పెట్టుకుంది. 2021 నుండి ఢిల్లీ క్యాపిటల్స్‌కు కెప్టెన్‌గా వ్యవహరించిన పంత్, 43 మ్యాచ్‌లలో జట్టును నడిపించాడు. 54.65% సక్సస్ రేటుతో 23 విజయాలు సాధించాడు. దీంతో లక్నో సూపర్ జెయింట్స్ పగ్గాలు పంత్ చేపడుతాడని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే ఈ విషయంపై నుండి అధికారిక ప్రకటన రాలేదు. కానీ పంత్ జట్టు కెప్టెన్సీని చేపట్టడం ఖాయంగా కనిపిస్తుంది.

జట్టు: నికోలస్ పూరన్, రవి బిష్ణోయ్, మయాంక్ యాదవ్, మొహ్సిన్ ఖాన్, ఆయుష్ బదోని, రిషబ్ పంత్ (రూ. 27 కోట్లు), డేవిడ్ మిల్లర్ (రూ. 7.5 కోట్లు), ఐడెన్ మార్క్రామ్ (రూ. 2 కోట్లు), మిచెల్ మార్ష్ (రూ. 3.40 కోట్లు), అవేష్ ఖాన్ (రూ. 9.75 కోట్లు), అబ్దుల్ సమద్ (రూ. 4.20 కోట్లు), ఆర్యన్ జుయల్ (రూ. 30 లక్షలు), ఆకాష్ దీప్ (రూ. 8 కోట్లు), హిమ్మత్ సింగ్ (రూ. 30 లక్షలు), ఎం. సిద్ధార్థ్ (రూ. 75 లక్షలు), దిగ్వేష్ సింగ్ (రూ. 30 లక్షలు), షాబాజ్ అహ్మద్ (రూ. 2.40 కోట్లు), ఆకాష్ సింగ్ (రూ. 30 లక్షలు), షామర్ జోసెఫ్ (రూ. 75 లక్షలు), ప్రిన్స్ యాదవ్ (రూ. 30 లక్షలు), యువరాజ్ చౌదరి (రూ. 30 లక్షలు), రాజవర్ధన్ హంగర్గేకర్ (రూ. 30 లక్షలు), అర్షిన్ కులకర్ణి (30 లక్షలు), మాథ్యూ బ్రీట్జ్కే (రూ. 75 లక్షలు).

13 ఏళ్ల బాలుడు ఐపీఎల్ ఆడొచ్చా?

'వైభవ్ సూర్యవంశీ' ప్రస్తుతం భారత క్రికెట్‌లో మారుమోగుతున్న పేరు. 13 ఏళ్ల వయసులోనే ఐపీఎల్ మెగా వేలంలో అమ్ముడైన వక్తిగా వైభవ్ సూర్య వంశీ చరిత్ర సృష్టించాడు. సోమవారం ముగిసిన ఐపీఎల్ 2025 మెగా వేలంలో రాజస్థాన్ రాయల్స్ ఈ బీహార్ కుర్రాడిని కొనుగోలు చేసింది. రూ. 30 లక్షల కనీస ధరతో వేలంలోకి వచ్చిన వైభవ్ సూర్యవంశీ కోసం ఢిల్లీ క్యాపిటల్స్‌తో పోటీ పడి మరీ రూ. కోటీ పది లక్షల భారీ ధరకు రాజస్థాన్ రాయల్స్ కొనుగోలు చేసింది. దాంతో ఐపీఎల్ చరిత్రలోనే క్యాచ్ రిచ్ లీగ్‌లో భాగమైన అతిపిన్న వయస్కుడి వైభవ్ సూర్యవంశీ నిలిచాడు. బీహార్‌లోని సమస్తిపుర్‌కు చెందిన వైభవ్ తండ్రి ప్రోత్సాహంతో నాలుగేళ్ల వయసులోనే బ్యాట్ పట్టాడు. వైభవ్ తండ్రి సంజయ్ సాధారణ రైతు. క్రికెట్‌పై అతనికి ఉన్న పిచ్చిని కొడుకుతో తీర్చుకోవాలనుకున్నాడు. కొడుకు ప్రాక్టీస్ కోసం ప్రత్యేక ప్రదేశాన్ని ఏర్పాటు చేశాడు. తండ్రి ప్రోత్సాహంతో క్రికెట్ ఓనమాలు నేర్చుకున్న వైభవ్.. కోచ్‌ల సాయంతో మరింత రాటు దేలాడు. 12 ఏళ్ల 284 రోజుల వయసులోనే సూర్య వంశీ.. బీహార్ తరఫున ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసి చరిత్ర సృష్టించాడు. ఆ తర్వాత భారత అండర్ 19 జట్టుకు ఎంపికయ్యాడు. ఆస్ట్రేలియాతో జరిగిన యూత్ వన్డేలో సెంచరీ సాధించి తన సత్తా ఏంటో ప్రపంచానికి తెలియజేశాడు. ప్రస్తుతం అండర్ 19 ఆసియా కప్ ఆడేందుకు దుబాయ్‌లో ఉన్నాడు. వైభవ్ సూర్యవంశీ ప్రతిభ గురించి తెలుసుకున్న రాజస్థాన్ రాయల్స్.. వేలానికి ముందు అతన్ని ట్రయల్స్‌కు ఆహ్వానించింది. నాగ్‌పూర్ వేదికగా జరిగిన ఈ ట్రయల్స్‌లో సూర్యవంశీ దుమ్మురేపాడు. ఒకే ఓవర్‌లో 17 పరుగులు చేయాలని ఆ జట్టు బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్ పెట్టిన టెస్ట్‌ను సూర్యవంశీ మూడు సిక్సర్లు బాది పాసయ్యాడని అతని తండ్రి తెలిపాడు. అయితే 13 ఏళ్ల పసిబాలుడు అంతర్జాతీయ స్టార్ క్రికెటర్లు ఆడే ఐపీఎల్ ఆడొచ్చా? క్రికెట్‌కు బాల కార్మికుల చట్టం వర్తించదా? అనే సందేహం చాలా మందికి కలుగుతోంది. బాల కార్మికుల చట్టం ప్రకారం 14 ఏళ్లలోపు పిల్లలు ఎవరూ ఎలాంటి పనులు చేయవద్దు. ముఖ్యంగా డబ్బులు ఆర్జించే పనులు అస్సలు చేయకూడదు.

ఐపీఎల్ 2025 మెగా వేలంలో రాజస్థాన్ రాయల్స్ 13 ఏళ్ల వైభవ్ సూర్య వంశీని కొనుగోలు చేసింది. దాంతో ఐపీఎల్ చరిత్రలోనే అమ్ముడైన అతి పిన్న వయస్కుడిగా వైభవ్ సూర్య వంశీ నిలిచాడు. ఒక కోటి 10 లక్షల రూపాయలకు రాజస్థాన్ రాయల్స్ అతన్ని సొంతం చేసుకోవడంతో వైభవ్



'సూర్యవంశీలో మంచి నైపుణ్యాలు ఉన్నాయి
అందుకే తీసుకున్నాం: రాహుల్ ద్రవిడ్

సూర్య వంశీ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలిచాడు. రూ. 30 లక్షల కనీస ధరతో వేలంలోకి వచ్చిన ఈ బాలుడి కోసం రాజస్థాన్ రాయల్స్.. ఢిల్లీ క్యాపిటల్స్‌తో పోటీ పడి మరి తీసుకుంది.అయితే వైభవ్ సూర్య వంశీని తీసుకోవడానికి గల కారణాన్ని రాహుల్ ద్రవిడ్ తాజాగా వెల్లడించాడు. రాజస్థాన్ రాయల్స్ నిర్వహించిన ట్రయల్స్‌లో సూర్య వంశీ అద్భుత ప్రదర్శన కనబర్చాడని చెప్పాడు. 'సూర్యవంశీలో మంచి నైపుణ్యాలు ఉన్నాయి. అతను క్రికెటర్‌గా ఎదిగేందుకు మా జట్టే మంచి వాతావరణమని మేం భావించాం. వైభవ్ మా ట్రయల్స్‌కు హాజరయ్యాడు. అద్భుత ప్రదర్శన కనబర్చాడు. అతని ఆటకు మేం ఫిదా అయ్యాం.'అని రాహుల్ ద్రవిడ్ చెప్పుకొచ్చాడు. ఈ వీడియోను ఐపీఎల్ నిర్వాహకులు సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. వైభవ్ సూర్య వంశీ తండ్రి సంజీవ్ కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించాడు. వేలం కంటే ముందు నాగ్‌పూర్ వేదికగా రాజస్థాన్ రాయల్స్ నిర్వహించిన ట్రయల్స్‌లో సూర్యవంశీ పాల్గొన్నాడని చెప్పాడు.

పృథ్వీపై ఆసక్తిచూపని ఫ్రాంచైజీలు

2018 అండర్ 19 ప్రపంచకప్ విజయంతో ఓ కుర్రాడు తారా జువ్వలా భారత క్రికెట్‌లోకి దూసుకొచ్చాడు. విధ్వంసకర బ్యాటింగ్‌తో మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్‌ను తలపిస్తూ.. భారత భవిష్యత్తు ఆటగాడిగా ప్రశంసలు అందుకున్నాడు. 19 ఏళ్ల వయసులోనే భారత జట్టు తరఫున టెస్ట్ క్రికెట్‌లోకి అరంగేట్రం చేశాడు. ఫస్ట్ మ్యాచ్‌లోనే సెంచరీ బాది అందరి నమ్మకాన్ని నిలబెట్టుకున్నాడు. ఆ కుర్రాడి బ్యాటింగ్‌ను చూసి టీమిండియాకు మరో కోహ్లీ దొరికాడని అంతా అనుకున్నారు. భవిష్యత్తులో టీమిండియాను ఏలుతాడ ని సునీల్ గవాస్కర్ వంటి దిగ్గజాలు మెచ్చుకున్నారు. కానీ 6 ఏళ్ల తర్వాత అదే కుర్రాడు ఐపీఎల్‌లో అన్‌సోల్డ్‌గా మిగిలిపోయాడు. అతన్ని కనీస ధరకు తీసుకునేందుకు కూడా ఫ్రాంచైజీలు ఆసక్తిచూపలేదు. అంతలా దిగజారిన ఆ ఆటగాడు ఎవరో కాదు.. టీమిండియా సెన్సేషన్ పృథ్వీ షా..! టాలెంట్ ఉంటే సరిపోదు.. అందుకు తగ్గట్లు క్రమశిక్షణ ఉండాలి అనే పెద్దల మాట పృథ్వీ షా కెరీర్‌ను చూస్తే స్పష్టంగా అర్థమవుతోంది. చిన్నవయసులోనే డబ్బు,ఫేమ్ రావడంతో పృథ్వీ షా గాడి తప్పాడు. చెడు స్నేహాలతో పాటు ఆటపై ఫోకస్ తగ్గింది. దానికి తోడు గాయాలు అతన్నివెంటాడాయి. 2018 ఆస్ట్రేలియా పర్యటనలో ఫీల్డింగ్ చేస్తూ గాయపడటం అతని కెరీర్‌ను అగాథంలోకి నెట్టింది. ఆ తర్వాత దగ్గు సిరప్ తాగి డోపింగ్ టెస్ట్‌లో విఫలమై బీసీసీఐ నుంచి నిషేధం ఎదుర్కొన్నాడు. ఐపీఎల్‌లో సత్తా చాటినా.. నిలకడలేమి అతనికి అవకాశాలు రాకుండా చేసింది. అవకాశాలు వచ్చినా తుది జట్టులో ఆడలేని పరిస్థితి ఏర్పడింది. కౌంటీ క్రికెట్, దేశవాళీ క్రికెట్‌లో సెంచరీల మోత మోగించినా.. గాయాల బారిన పడటంతో అతని కెరీర్‌ను మరింత నాశనం చేసింది. స్వప్నగిల్ అనే యూట్యూబర్‌తో జరిగిన గొడవ అతనికి తీవ్ర నష్టం చేసింది. వరుస గాయాలు.. అవకాశాలు లేకపోవడంతో పృథ్వీ షా తీవ్ర డిప్రెషన్‌కు లోనయ్యాడు. ఫిట్‌నెస్‌పై దృష్టిసారించలేకపోయాడు.

నాలుగేళ్ల వయసులోనే తల్లి మరణించడంతో.. తండ్రి చాటున పెరిగిన పృథ్వీ షా.. స్వయంకృపరాధంతో పాటు విధిరాత కూడా కలిసిరాలేదు. 23 ఏళ్ల వయసులోనే పొట్ట, బట్టతో కనిపించి తీవ్ర బాడీషేమింగ్‌కు గురయ్యాడు. కోచ్‌ల మాట వినకపోవడం.. సరిగ్గా ప్రాక్టీస్ చేయకపోవడంతో ముంబై జట్టు కూడా అతన్ని రంజీ టీమ్ నుంచి తప్పించింది. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీతో మళ్లీ ముంబై జట్టులోకి రీఎంట్రీ ఇచ్చినా మునపటిలా ఆకట్టుకోలేకపోయాడు. రంజీ ట్రోఫీలోనూ స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేదు. దాంతో ఫ్రాంచైజీలు పృథ్వీ షాను తీసుకునేందుకు ఆసక్తి చూపించలేదు. ప్లేయర్లు తక్కువగా ఉన్న ఫ్రాంచైజీలు కరుణించి తీసుకోవడమో.. లేక గాయపడ్డ ఆటగాళ్ల ప్లేస్‌లో రిప్లేస్‌మెంట్ అవుతనో తప్పా పృథ్వీ షా ఐపీఎల్ 2025 ఆడేందుకు అస్కారం లేదు. భారత్ క్రికెట్‌ను ఏలాల్సినోడు ఇలా అన్‌సోల్డ్‌గా నిలవడం అభిమానులను బాధిస్తోంది. సెహ్వాగ్ తరహాలో ఫియర్‌లెస్ గేమ్ ఆడే పృథ్వీ షా ఆటకు చాలా మంది అభిమానులు ఉన్నారు. పృథ్వీ షా మరో వినోద్ కాంబ్లీలా తయారయ్యాడని ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు. అతని సారథ్యంలో ఆడిన శుభ్‌మన్ గిల్ టీమిండియా కెప్టెన్సీ రేసులో ఉండగా.. అర్ష్‌దీప్ సింగ్ స్టార్ పేసర్ అయ్యాడు. రియాన్ పరాగ్, అభిషేక్ శర్మ అంతర్జాతీయ టీ20లు ఆడుతున్నారు. వీళ్లందరి కంటే ముందే భారత జట్టు తరఫున అవకాశాలు అందుకున్న పృథ్వీ షా మాత్రం అన్‌సోల్డ్‌గా నిలిచిపోయాడు.

సనాతన బోర్డు ఎందుకంటే..

ఇతర మతాలకు బోర్డులు ఉన్నట్టుగానే హిందువుల కోసం సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు కావాలన్న ఉద్యమం ప్రారంభమైంది. దేశవ్యాప్తంగా ఉన్న హిందువులు ప్రత్యేక సనాతన బోర్డు ఏర్పాటును డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్.. తిరుపతి లడ్డూ వివాదం తర్వాత లేవనెత్తిన సనాతన బోర్డు అంశం అగ్గి రాజేసింది. 'సెక్యులరిజం అనే పేరుతో హిందువుల నోరు నొక్కేస్తున్నారు.

సుమన్ గునిశెట్టి

సనాతన ధర్మాన్ని సూడో సెక్యులరిస్టులు విమర్శిస్తున్నారు. సనాతన ధర్మం, హిందూ దేవుళ్లను విమర్శించేవారు ఎక్కువయ్యారు. ఇస్లాం దేశాల మాటలు సూడో సెక్యులరిస్టులకు వినపడవు. బంగ్లాదేశ్ ఇస్లాం రాజ్యంగా ప్రకటించుకున్నా ఎవరూ మాట్లాడలేదు. పళ్ల బిగువున బాధను భరించాలా? మన సమాజంలో ఐక్యత లేకపోవడమే దీనికి కారణం. హిందూ సమాజాన్ని కులాలు, ప్రాంతాల వారీగా విభజించారు. హిందువులంతా ఏకమయ్యే సమయం వచ్చింది. మనం మన మతం గురించి మాట్లాడుకోవాలంటేనే భయపడే పరిస్థితికి వచ్చాం. సనాతన ధర్మానికి రంగు, వివక్ష లేదు. మెకాలే తీసుకువచ్చిన వివక్ష ఇదంతా. మన దేవాలయాలు విద్య, కళలు, ఆర్థిక కేంద్రాలుగా విలసిల్లాయి. అవి పర్యావరణ పరిరక్షణ, సంక్షేమ కేంద్రాలుగా మారాలి. భిన్నత్వంలో ఏకత్వం చూపేది, ఇతర మతాలను గౌరవించేది సనాతన ధర్మం. సనాతన ధర్మం ప్రకృతిలో ఉన్న ప్రతి జీవి సుఖంగా ఉండాలని కోరుకుంటుంది. ధర్మానికి ప్రతిరూపం శ్రీరాముడు. కలియుగంలో ధర్మానికి ప్రతిరూపం వేంకటేశ్వరస్వామి. సనాతన ధర్మంపై దాడి జరిగితే ఒక్కరూ మాట్లాడరు. మిగతా మతాలపై దాడి జరిగితే మాత్రం ప్రముఖులంతా మాట్లా డతారు. హిందూ సమాజంపై దాడి తప్పని తెలిసి కూడా మాట్లాడరు. తప్పులు జరుగుతుంటే ఎన్నాళ్లు ఊరుకుంటాం? సనాతన ధర్మంపై దాడి జరిగితే మౌనంగా ఊరుకోవాలా? అన్ని మతాలు పరస్పరం గౌరవించుకోవడమే లౌకికవాదానికి అసలైన అర్థం. మా ఆవేదన, బాధ, ఇబ్బందులు మాత్రమే చెప్తున్నాం. ఎంతమంది రాక్షసులు అడ్డుపడినా సనాతన ధర్మానికి ఏమీ కాదు' అని పవన్ కల్యాణ్ కుండబద్దలు కొట్టారు. నిజమే.. ఆయన అన్న మాటలు నూటికి నూరుపాళ్లు నిజం. సనాతన ధర్మాన్ని మనమే రక్షించుకుందాం. సనాతన ధర్మంపై దాడి జరిగినా, అపహాస్యం చేసినా తిరగబడదాం. సనాతన ధర్మాన్ని దూషిస్తే ప్రాణాలు ఒడ్డయినా రక్షించుకుందాం. అందుకే సనాతన ధర్మాన్ని కాపాడుకునేందుకు సనాతన బోర్డు కావాల్సిందే. ప్రభుత్వ ఆధీనంలోని దేవాదాయ శాఖ.. కేవలం ఆలయాల ఆదాయ వనరుపైనే ఆధారపడింది. భక్తుల మనోభావాలు కాపాడటంలో, ఆలయాల పరిరక్షణలో వెనుకబడింది. కారణం.. దేవాదాయ శాఖ రాజకీయ ఛట్రంలో బందీ కావడమే.

- దేవాలయాలు, దేవాలయ ఆస్తులను రక్షించుకునేందుకు సనాతన బోర్డు కావాలి.
- హిందువులు మైనారిటీలుగా మారుతున్న ప్రాంతాలు ఉన్నాయి. వాటిని కాపాడుకోవడానికి సనాతన బోర్డు కావాలి.
- పశ్చిమ బెంగాల్‌లో అనేక మంది ప్రజలు తమ ప్రాంతాలను కోల్పోతున్నారు. వారిని రక్షించుకోవడానికి సనాతన బోర్డు కావాలి.
- తిరుపతి లడ్డూ కల్తీ వివాదం దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. హిందువులను కాని వారిని దేవాలయాల్లోకి అనుమతించవద్దు. ఇది హిందువుల మనోభావాలను దెబ్బతీస్తుంది. ఇలాంటి ఒక్క చర్య చాలు.. సనాతన బోర్డు ఆవశ్యకతను నొక్కి చెప్పడానికి.

శ్రీ మహావిష్ణువు 24 అవతారాలు

వెలుగును చీకటి ఆక్రమించిన ప్రతీసారి, న్యాయంపై అన్యాయం పాలిస్తే, ధర్మాన్ని పునరుద్ధరించడానికి.. ప్రజలను సన్మార్గంలో నడిపించేందుకు విష్ణుమూర్తి భూమిపై పునర్జన్మ చేస్తాడని భాగవత పురాణం పేర్కొంది. ఇప్పటికే శ్రీమహావిష్ణువు 23 సార్లు పునర్జన్మ పొందాడు. కలియుగ ముగింపులో చివరగా 24వ అవతారంలో కల్కి అవతారం ఎత్తుతాడు.

ఆ అవతారాలు ఇవే..

1. ఆది పురుషుడు
2. నలుగురు కుమారులు (సనక, సనాతన, సనందన, సనత్ కుమార)
3. నారదుడు
4. నర నారాయణ
5. కపిల
6. దత్తాత్రేయ
7. యజ్ఞము
8. రిషభ
9. పృథు
10. ధన్వంతరి
11. మోహిని
12. హయగ్రీవుడు
13. వ్యాసుడు
14. మత్స్య అవతారం
15. కూర్మ అవతారం
16. వరాహ అవతారం
17. నృసింహ అవతారం
18. వామనుడు
19. పరశురాముడు
20. శ్రీరాముడు
21. బలరాముడు
22. కృష్ణుడు
23. బుద్ధుడు
24. కల్కి

ధర్మ పరిరక్షణే ధ్యేయంగా..
సంస్కృతిని కాపాడే లక్ష్యంగా..
మన ఔన్నత్యాన్ని పెంచేలా..
మన ఔచిత్యాన్ని చాటేలా..
తెలుగు చరిత్రలోనే తొలిసారి..
ధర్మం కోసం అక్షర తపస్సు చేస్తూ..
తెలుగు ప్రజల కోసం వస్తున్నది..

"ఋషి తెలుగు దినపత్రిక"

'కురుక్షేత్రం' అన్న పేరుతో..
సంపాదకీయాన్ని తీసుకొస్తున్నది
ఆసక్తి కలిగిన రచయితలు..
ధర్మ పరిరక్షకులు..
ఈ అక్షర యజ్ఞంలో
పాలుపంచుకోవాలని విజ్ఞప్తి.
కురుక్షేత్రం పేజీ కోసం తమ
వ్యాసాలు పంపి
మరింత మందికి జ్ఞానాన్ని
ప్రసాదించాలని వినతి.

కాపాడుకుందాం
మన దేశాన్ని!
మన ధర్మాన్ని!!

గాలులు.. వాటి స్వభావాలు

భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా సూర్య చంద్రుల గమనాలను బట్టి భూమి స్వరూపం 8 దిక్కులు. గాలి ఒకటే అయినా అన్ని దిక్కుల నుంచి వీచే గాలులు ఒకే రకంగా ఉండవు. దిక్కుల స్వభావాన్ని బట్టి గాలి స్వభావాన్ని కలిగి ఉంటుంది. ఒక్కో రుతువులో ఒక్కో దిక్కు నుంచి ఒక్కో రకమైన గాలి వీస్తుంది. వాటి కలిగే ప్రయోజనాలు, దుష్ప్రయోజనాలు తెలుసుకోవడం చాలా ముఖ్యం.



దక్షిణ దిక్కు గాలులు: ఏప్రిల్ , మేలో వచ్చే వసంత మాసంలో దక్షిణ దిక్కు నుంచి గాలులు నెమ్మదిగా వీస్తాయి . ఇవి మలయ పర్వతం మీదగా వీస్తూ ఆ పర్వతం మీద ఉన్న ఔషధాల సువాసనలను తీసుకొస్తాయి. ఈ మలయ పవనాలు తమ చల్లని స్పర్శతో మానవాళిని వేసవితాపం నుంచి కాపాడతాయి. ఈ గాలులని ఆస్వాదించగలిగితే శరీరంలోని త్రిదోషాలు హరించి చక్కటి ఆరోగ్యం చేకూరుతుంది. ఈ గాలిలో తీపి, చేదు, వగరు రుచులు ఉంటాయి. ఈ కాలంలో అదే స్వభావం కలిగిన ఈశాన్య గాలులు కూడా వీస్తాయి.

నైరుతి గాలులు: జూన్ , జూలైలో వచ్చే గ్రీష్మ రుతువులో నైరుతి దిక్కు నుండి గాలులు వీస్తాయి . ఈ గాలులు కారం రుచిని కలిగి ఉంటాయి. ఇవి వేడి చేసే స్వభావం కలిగి ఉంటాయి. ఈ గాలులు వల్ల ఉదర సంబంధిత రోగాలు, పైత్య రోగాలు పుడతాయి. రక్త, పిత్త రోగాలు కూడా పుడతాయి. ఈ నైరుతి గాలులు అనేక రోగాలకు నిలయాలు.

పడమర గాలులు: ఆగస్టు, సెప్టెంబర్లో ఉండే వర్ష ఋతువులో పడమర గాలులు వీస్తాయి. ఈ గాలులు వెగటుగా ఉండి వేడి చేసే స్వభావం కలిగి ఉంటాయి. అయినా గ్రీష్మ ఋతువులో నైరుతి గాలుల వలన ఏర్పడిన రక్త, పిత్త వ్యాధులు హరించి పోతాయి. ఎంతో కాలం నుంచి ఉన్న వివిధ వ్రణాలు మాడిపోతాయి.

వాయవ్య గాలులు: అక్టోబర్, నవంబర్లో ఉండే శరత్కాలంలో వాయవ్య దిక్కు నుంచి గాలులు వీస్తాయి. ఈ గాలులలో కారం, చేదు గుణాలు ఉంటాయి. తేమ ఉండదు. అందుకే ప్రసన్నంగా ఉంటాయి. అయితే వాత వ్యాధులు కలిగించడం, వాత వ్యాధులు ఉన్నవారికి ఎక్కువ అవ్వడం ఈ గాలుల స్వభావం. కఫ రోగాలు , పైత్య రోగాలు తగ్గించి ఒంటిలోని చెడు నీరు తొలగించే గుణం ఈ గాలులలో ఉంటుంది.

తూర్పు, ఉత్తర గాలులు: డిసెంబర్, జనవరిలో ఉండే హేమంత ఋతువులో తూర్పు దిక్కున ఉండి ఉత్తర దిక్కుకు ఈ గాలులు వీస్తాయి. తూర్పు గాలులు చలువ చేస్తాయి. వీటివల్ల వాత, కఫ, పైత్య రోగాలు పెరుగుతాయి. ఒంటి నిండా నీరు పట్టే ఉబ్బు వ్యాధిని కలిగిస్తాయి. ఉత్తరపు గాలులు కూడా చల్లగా ఉంటాయి. ఇవి కఫాన్ని , కొవ్వును పెంచుతాయి.

ఆగ్నేయ గాలులు: ఫిబ్రవరి, మార్చిలో ఉండే శిశిర ఋతువులో ఆగ్నేయ దిక్కు నుండి గాలులు వీస్తాయి. ఇవి కూడా అమిత చల్లగా ఉంటాయి. వాత వ్యాధులను పుట్టిస్తా యి. ఉబ్బు రోగాలు, వ్రణాలు ఉన్నవారిని మరింత పీడిస్తాయి.

OWNED, PUBLISHED AND PRINTED BY **TIRUMALASHETTY RAMACHANDRA RAO**, PRINTED AT VAIBHAV ART PRINTERS, #11-5-419, RED HILLS, LAKADIKAPOOL, HYDERABAD500004, TELANGANA, PUBLISHED AT 6-1-628/4/7, MARKET ROAD, KHIRATABAD, HYDERABAD-4, TELANGANA EDITOR : **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NUMBER: APTEL/2008/26409, CELL: 9666711515, EMAIL: rhushinews@gmail.com